ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

శుక్రవారం 16 ఫిబ్రవరి 2024





తెనాలి: భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



సీఎం సభకు బస్సులు వెళ్లడంతో నిర్మానుష్యంగా ఉన్న రేపల్లె డిపో

సీఎం సభంటే.. వణికే



వైసీపీ జెండాలతో వెళ్తున్న బాపట్ల ఆర్టీసీ డిపో బస్సు

- బస్సులన్నీ జగన్ సభ కేటాయింపు
- సర్వీసులు లేక ప్రయాణాలకు ఇక్కట్లు
- అన్ని డిపోల నుంచి ఫిరంగిపురానికి తరలింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 400 కేటాయింపు
- బస్సులను దారిమళ్లించి అదనపు చార్జీ వసూళ్లపై గగ్గోలు
- తెనాలి - గుంటూరు రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- బెదిరించి ఫిరంగిపురం సభకు తరలింపుపై వలంటీర్ల ఆవేదన

గుంటూరు, బాపట్ల, రేపల్లె, ఫిబ్రవరి 15: ముఖ్యమంత్రి జగన్ సభ అంటే ప్రజలు వణికిపోయే పరిస్థితి వస్తోంది. సామాన్యులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ సీఎం జగన్ సేవలో తరిస్తోంది. ముఖ్యమంత్రి సభ అంటే చాలు ఆర్టీసీ డీపోలు ఖాళీ అవుతుండగా.. ప్రయాణాలకు సామాన్యులు అల్లాడిపోతున్నారు. డిపోల్లో బస్సులన్నింటినీ సీఎం సభకు కేటాయించడం పరిపాటిగా మారింది. సీఎం సభ అంటే చాలు బస్సులన్నింటినీ కేటాయిస్తుండటంతో సామాన్య ప్రయాణికులకు ప్రయాణ కష్టాలు తప్పడంలేదు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చిన మా తీరు మారదు.. అన్నట్లుగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. గురువారం ఫిరంగిపురంలో వలంటీర్లకు అభినందన పేరుతో నిర్వహించిన సభకు ముఖ్యమంత్రి జగన్ హాజరయ్యారు. ఈ క్రమంలో సభను విజయవంతం చేసేందుకు పెద్దసంఖ్యలో వలంటీర్లను తరలించారు. ఇందుకోసం సచివాలయాల వారీగా బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో డిపోలన్నీ కూడా బస్సులు లేక వెలవెలపోయాయి. ప్రయాణాలకు సిద్ధమై వచ్చిన వారు డిపోల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంతకాలం సీఎం సభ అంటే ప్రయాణాలకు సామాన్యులు ఇబ్బంది పడగా గురువారం పలు రూట్లలో వాహనాల దారి మళ్లింపు కారణంగా దూరం పెరిగి ఆ మేర ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేసి వారి జేబులకు చిల్లుపెట్టారు. సీఎం సభ కోసం ఉమ్మడి జిల్లా నుంచి 400 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా మరో 60 నుంచి 70 సర్వీసులు రప్పించారు. ఆర్డినరీ బస్సులు లేక గుంటూరు-విజయవాడ, గుంటూరు-పర్చూరు, గుంటూరు-బాపట్ల ప్రాంతాల వరకు అనేక ఇబ్బందులు పడ్డారు. విజయవాడ రూట్‌లో అయితే ఆర్డినరీ సర్వీసులు లేక నాన్ స్టాప్ సర్వీసులు ఎక్కి మధ్యలో ఆపాలని ప్రయాణికులు కొందరు సిబ్బందితో వాగ్వాదాలు కూడా జరిగినట్లు సమాచారం. డిపోల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు సీఎం సభకు పెట్టడంతో రోజువారి ప్రయాణికులు బస్సుల కొరతతో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వచ్చింది. రేపల్లె డిపో నుంచి బస్సులతో పాటు విద్యా సంస్థల బస్సులు కూడా వలంటీర్ల సభకు తరలి వెళ్ళాయి. ఇక్కడ బస్సులే కాక కాకినాడ డిపోకు చెందిన బస్సులను కూడా తెప్పించి తీర ప్రాంత గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున సీఎం సభకు తరలించారు. సీఎం సభకు బాపట్ల డిపోలో 27 బస్సులు ఉండగా 20 బస్సులను కేటాయించారు. తెనాలి నుంచి మరో నాలుగు బస్సులు తెప్పించారు. దీంతో ఆర్టీసీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బస్సులు లేక ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

వస్తావా.. చస్తావా

గుంటూరు సిటీ, పిడుగురాళ్ల: 'ఏంట్రా ఓవర్ యాక్షన్ చేస్తున్నావ్. బస్సు వచ్చి ఎంత సేపైంది.. నువ్వేమన్న కలెక్టర్‌వా.. గంటలు గంటలు బస్సు ఆగడానికి.. మర్యాదగా వచ్చి బస్సెక్కు.. పిచ్చి పిచ్చి కలలు పడ్డావంటే ఉన్న ఉద్యోగం పోతుంది.. గంజాయి కేసులో పెట్టిస్తా నా కొ..' అంటూ వలంటీర్‌పై అధికార పార్టీ నేత బూతు పురాణమిది. గురువారం ఫిరంగిపురంలో జరిగే వలంటీర్ల అభినందన సభకు వలంటీర్ల తరలింపులో అధికార పార్టీ నేతలు అవలంబించిన తీరికిదో నిదర్శనం. వలంటీర్లందరూ రావాల్సిందే. సభకు ఏ ఒక్క వలంటీర్ కూడా మిస్‌కాకూడదు.. అంటూ వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ చేయగా, వైసీపీ నేతలు ఎలాగైనా వారిని తీసుకెళ్లేందుకు చేయని ప్రయత్నం లేదు. జ్వరంతో బాధపడుతున్నా, సొంతింట్లో శుభకార్యం ఉందని చెప్పినా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ సభకు రావాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. సీఎం జగన్ సభకు తప్పనిసరిగా రావాలని వలంటీర్లపై అధికార పార్టీ నేతలు నానా రకాలుగా ఒత్తిడి చేశారు. వలంటీర్లను తీసుకువచ్చే బాధ్యతను సచివాలయ కార్యదర్శికి అధికారులు అప్పగించారు. ఎవరు కార్యక్రమానికి వస్తున్నారు.. ఎవరు వెనకడుగు వేస్తున్నారు.. అన్న దానిపై సచివాలయ కార్యదర్శులు వివరాలు సేకరించారు. అయినా చాలామంది పెద్దగా ఆసక్తి ప్రదర్శించలేదు. ఈ పరిస్థితుల్లో వలంటీర్లను సీఎం సభకు తరలించే బాధ్యత ను ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, అధికార పార్టీ నేతలు నెత్తికి ఎత్తుకున్నారు. మొదట నయాన, భయాన చెప్పి చూసినా వలంటీర్లు వెళ్లేందుకు ససేమిరా అనడంతో నేతలు బూతుల పంచాంగంతో బెదిరింపు లకు దిగారు. సభకి రాకపోతే ఉద్యోగం పోతుంది.. అంతటితో ఆగము.. ఇంకా చాలా జరుగుతాయి అంటూ పలు ప్రాంతాల్లో బెదిరించారు. ప్రత్తిపాడు, బాపట్ల, తెనాలి, వేమూరు, పొన్నూరు, గుంటూరు-2, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, గురజాల తదితర నియోజకవర్గాల్లో ఎక్కువ మంది వలంటీర్లు సభలో పాల్గొనేందుకు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటలకే ఆయా ప్రాంతాలకు బస్సులు వెళ్లాయి. అయినా ఉదయం 11 గంటలు దాటినా చాలామంది వలంటీర్లు బస్సులు ఎక్కక పోవడంతో స్థానిక వైసీపీ నేతలు బూతుపురాణాలు లంకించుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లను తరలించే కార్యక్రమాన్ని నేరుగా ఎమ్మెల్యేలు పర్యవేక్షించారు. కొందరితో ఎమ్మెల్యేలే ఫోన్‌లో మాట్లాడి సభకు వెళ్లాలని చెప్పినట్లు తెలుస్తోంది.

ఎంత బెదిరించినా సగమే హాజరు

సీఎం సభకు రావాలని వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలు, బెదిరింపులను చాలా మంది పెద్దగా పట్టించుకోలేదు. సగానికి తక్కువ మందే సీఎం సభకు వెళ్లినట్లు తెలుస్తోంది. చాలా మంది తాము బయట ఉన్నామంటూ డుమ్మా కొట్టారు. నేతల ఒత్తిడి తాళలేక ఫిరంగిపురం వచ్చినా చాలామంది బస్సుల్లోనే కూర్చుండిపోయారు.

సచివాలయం మూత

పేరుకు వలంటీర్లుకు వందన కార్యక్రమం అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సచివాలయాలన్నీ మూత పడ్డాయి. సచివాలయంలోని ఉద్యోగులందరూ సీఎం సభకు రావాలని అధికారులు ఆదేశించారు. దీంతో సచివాలయాలకు తాళాలు పడ్డాయి. ఊర్లకు వచ్చిన బస్సులు ఖాళీగా వెళ్లకుండా సచివాలయ ఉద్యోగులతో మీటింగ్ ప్రదేశానికి చేరుకున్నాయి.

నిలిచిన ట్రాఫిక్

తెనాలి రూరల్: ఫిరంగిపురం వద్ద ఏర్పాటు చేసిన సీఎం సభకు వలంటీర్లను తరలించే బస్సుల కారణంగా ఆయా మార్గాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో ప్రయాణికులకు నరకం కనిపించింది. తెనాలి మండలం అంగలకుదురు- సంగంజాగర్లమూడి మధ్యలో బస్సుల్లో వెళ్లే వారికి విందు ఏర్పాటు చేశారు. ఆయా వాహనాలను రద్దీగా ఉండే ప్రధాన రోడ్డుపై నిలిపివేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు గంటల తరబడి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపుగా రెండు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన మార్గంలో వాహనాలను నిలిపి దర్జాగా విందు చేయడం ఏమిటో.. ఎప్పుడు చూడలేదని వాహనదారులు మండిపడ్డారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి పోవడంతో అంబులెన్స్‌లు సైతం వేచి ఉండక తప్పలేదు. తెనాలి రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు 30 నిమిషాలు ప్రయత్నిస్తే కానీ వాహనాలు ముందుకు కదలలేదు. పొలాల్లో భోజనాలు చేయడంతో పంటలు దెబ్బతింటాయని చెబుతున్నా పట్టించుకోలేదని కొందరు రైతులు వాపోయారు.



DONDAPADU VOLUNTEERS ATTENDANCE REPORT 15-02-2024

S.no	CLUSTER NO	Name of the Volunteer	Mobile No.	Signature
			8688595139	[illegible]
1	C1	PERAM ALIVELU	9154498153	
2	C2	BEJANKIS IVASANKAR	7569807798	[illegible]
3	C3	CHINNAPUREDDY R MAPRIYA	9154498168	Ch. Sailakshmi
4	C4	PERAM SUSHMITHA	9573318870	
5	C5	CHIMATASRILAKSHMI	7661959482	
6	C6	YASAM MANIKANTA	8555063482	
7	C7	NELLURI PAVAN	8688661712	[illegible]
8	C8	KRISTAPATIRAMYALATHA	8186947814	[illegible]
9	C9	MEESALASIVAKRISHNA	7997245754	
10	C10	BANDARUCHINARAMBABU	9010971986	[illegible]
11	C11	PUTLURI SRILATHA	9154498155	
12	C12	PAMURI GOPI	7993927673	
13	C13	KONDRU YADAGIRI	9154498158	
14	C14	KALEKURI TIRUMALABABU		

పల్నాడు జిల్లా దొండపాడు నుంచి సగం మంది వలంటీర్లే వెళ్లినట్లు ఉన్న హాజరు షీట్

దూరం.. భారం

గుంటూరు: సీఎం జగన్ సభ అంటే ఆర్టీసీ ప్రయాణికులకు మొన్నటి వరకు ప్రయాణ కష్టాలు ఉండేవి. తాజాగా ప్రయాణంతో పాటు జేబులకు చిల్లు పడింది. సీఎం సభ పేరుతో ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి ఆ పెరిగిన దూరం మేర ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు. ఫిరంగిపురంలో గురువారం జరిగిన జగన్‌సభ కారణంగా గుంటూరు నుంచి నరసరావుపేట, వినుకొండ వైపు నకు వెళ్లే వాహనాలను పేరేచర్ల, సత్తెనపల్లి, ముప్పాళ్ల మీదగా నరసరావుపేటకు, అలానే గుంటూరు నుంచి యడ్లపాడు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదగా వినుకొండకు దారి మళ్లించారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులను కూడా ఆయా రూట్లలో తిప్పారు. ఇదే అదునుగా పెరిగిన దూరం భారాన్ని ప్రయాణికుల నెత్తిన వేసే పథకాన్ని ఆర్టీసీ అమలుచేసింది. సాధారణంగా నరసరావుపేట నుంచి గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసుకు రూ.85 వసూలు చేస్తారు. గురువారం మారిన రూట్ ప్రకారం బస్సు ఎక్కిన వారినుంచి రూ.110 ఛార్జీ వసూలు చేశారు. అలానే ఆర్డినరీ సర్వీసు సాధారణ రోజుల్లో రూ.55 వసూలు చేస్తుండగా గురువారం రూ.60 వసూలుచేశారు. ఇక వినుకొండ నుంచి గుంటూరుకు సాధారణ రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రూ.125 ఉండగా గురువారం రూ.140 వసూలు చేశారు. సీఎం సభ కోసం బస్సులను దారి మళ్లించి ప్రయాణ సమయాన్ని పెంచడమే కాక అదనపు బాదుడుతో జేబులకు చిల్లు పెట్టడంపై ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. ఇదేం బాదుడని సిబ్బందిని ప్రశ్నించడంతో చిన్నపాటి వాగ్వాదాలు కూడా చోటు చేసుకున్నాయి.

దూరం పెరగటంతో తప్పలేదు..

సీఎం సభ కోసం రూట్ మళ్లింపుతో 15 నుంచి 16 కిలోమీటర్ల వరకు దూరం పెరిగింది. దానికి అనుగుణంగా కిలోమీటర్ల వార ఛార్జీ పెంచాల్సి వచ్చింది. ఒకటి, రెండు కిలోమీటర్లు ఉంటే పెద్ద పట్టించుకునే వాళ్లం కాదు. దూరం ఎక్కువగా పెరగడంతోనే టిక్కెట్ రేటు పెంచాల్సి వచ్చింది.

- పల్నాడు డీపీటీవో శ్రీనివాస్



రేపల్లె: బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

టీడీపీలోకి బాచిన

- బెడిసికొట్టిన వైవీ సుబ్బారెడ్డి వ్యూహం
- చంద్రబాబును కలిసిన వైసీపీ నేత చైతన్య
- పసుపు కండువా కప్పుకున్న సంతమాగులూరు నేతలు

అద్దంకి, బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పాలకపార్టీ విధానాలపై రగిలిపోతున్న అద్దంకి వైసీపీ నేత, శాప్‌నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే గరటయ్యలు గురువారం టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో వీరి కలియక జరిగింది. ఈ సమయంలో సంతమాగులూరు మండలం మాజీ ఎంపీపీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల వరకు ఉన్న అట్ల చినవెంకటరెడ్డితో పాటు ప్రస్తుత ఎంపీపీ యలమంద ఆ మండల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

అభిప్రాయం చెప్పినందుకు వేధింపులు

అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా దాదాపు నాలుగేళ్ల పాటు శాప్‌నెట్ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య వ్యవహరించారు. ఇటీవల అధిష్ఠానం చేపట్టిన మార్పుల్లో భాగంగా పల్నాడు జిల్లాకు చెందిన హనిమిరెడ్డిని ఇన్‌చార్జిగా నియమించడాన్ని చైతన్య తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత పార్టీ పెద్దలను పలుమార్లు కలిసి తాను పార్టీ కోసం కష్టపడ్డానని, తననే కొనసాగించాలని అభ్యర్థించారు. అయినా అటు వైపు నుంచి కదలిక లేకపోగా పార్టీ నిర్ణయాన్ని ధిక్కరిస్తే చర్యలు తప్పవని సంకేతాలు పంపారు. ఈ క్రమంలోనే ఆయనకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీపై అధికారులను దాడులకు వైసీపీ ఉసిగొల్పింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కృష్ణ చైతన్యతో పాటు ఆయన తండ్రి, గరటయ్య చంద్రబాబుతో భేటీ అవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

అంతా బాలినేని వర్గమే...

అట్ల చినవెంకటరెడ్డితో పాటు ఆయన వర్గం తొలి నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ మంత్రి బాలినేని మద్దతుదారులుగా ఉంటూ వస్తున్నారు. అద్దంకిలో ఇటీవల జరుగుతున్న పరిణామాలపై వారు ఉక్కపోత ఎదుర్కొంటున్నారు. దీంతో ఆయన పార్టీ మారడానికి కొన్ని రోజుల క్రితమే అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. చేరికలను ఆపడానికి తాడేపల్లి పెద్దలు మాజీ మంత్రి బాలినేని సాయాన్ని కూడా అభ్యర్థించారనే ప్రచారం అప్పట్లో వచ్చింది. ఈ ప్రయత్నం కూడా బెడిసికొట్టడంతో వారిపై కూడా కక్షసాధింపులకు దిగారు. అంతిమంగా తన అనుచరులతో కలిసి చిన వెంకటరెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. జగన్ చిన్నాన్న వైవీ సుబ్బారెడ్డి సిఫారసుతోనే అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా హనిమిరెడ్డిని అధిష్ఠానం నియమించిందనేది బహిరంగ రహస్యం. ఈనిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన మాజీ మంత్రి బాలినేని, చైతన్యకు మద్దతుగా ఒకట్రెండు సార్లు పార్టీ పెద్దలను కూడా కలిశారు. అద్దంకిలోని క్షేత్రస్థాయి పరిస్థితుల పట్ల సీఎం జగన్‌ను సుబ్బారెడ్డి పక్కదారి పట్టించడం వల్లే ఇన్‌చార్జి మార్పు నిర్ణయం జరిగిందనే అంచనాకు సైతం చైతన్య వచ్చారు. అప్పటి నుంచి పరోక్షంగా ఆయనపై తన అసంతృప్తిని వెళ్లగక్కుతూనే వస్తున్నారు. ప్రస్తుతం చైతన్య చంద్రబాబును కలవడంతో ఆయన టీడీపీలో చేరడం ఇక లాంఛనమేనని తెలుస్తోంది. సంతమాగులూరు మండలానికి చెందిన కీలక నేతలు పెద్ద సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరడంతో వైవీ రాజకీయ వ్యూహం వికటించినట్లైంది.

దర్శి సీటు పైనే చర్చ..

కృష్ణచైతన్య మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అవడంతో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ఆయన ప్రకాశం జిల్లాలోని దర్శి సీటు ఆశిస్తున్నారని, అదే విషయాన్ని టీడీపీ అధినేత ముందుంచారని తెలుస్తోంది. గురువారం మర్యాదపూర్వకంగా భేటీ అయినప్పటికీ త్వరలోనే తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరనున్నారని సమాచారం.



చంద్రబాబుతో శాప్‌నెట్ చైర్మన్ చైతన్య, ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే గరటయ్య



చంద్రబాబుతో అట్ల చినవెంకటరెడ్డి వర్గీయులు

రేపే.. రా.. కదలిరా

- ఇంకొల్లులో భారీగా ఏర్పాట్లు
- 25 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగసభ
- ప్రాంగణానికి తారకరామ విజయభేరిగా నామకరణం
- నియోజకవర్గ నేతలతో ఏలూరి సన్నాహక సమావేశం
- పోలీసులను ప్రయోగించి అవాంతరాలకు ప్రభుత్వం కుట్ర

ఇంకొల్లు/బాపట్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రా.. కదలి రా అంటూ టీడీపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. రా.. కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోక్‌సభ స్థానాల వారీగా బహిరంగ సభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బాపట్ల లోక్‌సభ స్థానంలోని పర్చూరు నియోజకవర్గ పరిధి ఇంకొల్లులో శనివారం సభ నిర్వహించనున్నారు. దాదాపు 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లను భారీఎత్తున చేస్తున్నారు. సభా ప్రాంగణానికి తారకరామ విజయ భేరిగా నామకరణం చేశారు. ఈ ఇప్పటికే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. హెలిపాడ్ స్థలం, పవర్‌రోలర్‌తో ప్రాంగణం అంతా గట్టి చేసే పనులు జరుగుతున్నాయి. 40 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో సభా స్టేజి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. వాహనాలను పార్కింగ్‌కు ఆరెకరాల భూమిని చదును చేశారు. స్థానిక నాయకులు పాలేరు రామకృష్ణ, డాక్టర్ శ్యాం, బత్తుల శ్రీనివాసరావు, కరి శ్రీను, వడ్లమూడి సాంబయ్య, శ్రీహరి, రంగయ్య, పొద వీరయ్య, ఫారూక్, చైతన్య, బోడావుల శివయ్య ప్రాంగణంలో పనులు పర్యవేక్షిస్తున్నారు.

అడ్డంకులపై నేతల ఆగ్రహం

బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సన్నాహక సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. శ్రేణులను సభకు సమాయత్తం చేయడంలో ఆయా నియోజకవర్గాలలో కూడా నాయకులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరోవైపు సభాస్థలికి అనుమతులు లేవని ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి ఏదోవిధంగా అవాంతరాలు సృష్టించే కార్యక్రమం చేస్తూనే ఉంది. రా.. కదలిరా సభకు తరలివచ్చేవారిని అడ్డుకునేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయినా ఎట్టి పరిస్థితుల్లో తగ్గేదేలే అన్నట్లుగా టీడీపీ శ్రేణులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. బుధవారం రాత్రి సభా ప్రాంగణానికి వచ్చి అనుమతులు లేవని హడావిడి చేసిన పోలీసులు దానిని గురువారం ఉదయం కూడా కొనసాగించారు. సభ నిర్వహిస్తున్న స్థలం దేవదాయశాఖదని, సదరు విభాగం అనుమతులు తీసుకోలేదని తమకు ఫిర్యాదు చేసిందని పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో గురువారం ప్రాంగణానికి చేరుకున్న పర్చూరు, అద్దంకి ఎమ్మెల్యేలు సాంబశివరావు, గొట్టిపాటి రవి కుమార్ ప్రభుత్వ పెద్దల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమి దేవదాయశాఖదే అయినా దానిని సాగుచేసే రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారని ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు. ఆ భూమికి మరో ఏడాది వరకు లీజు అగ్రిమెంట్లు ఉన్న సమయంలో పోలీసులు ఎలా అడ్డుకుంటారని నిలదీశారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా శనివారం చంద్రబాబు హాజరయ్యే రా.. కదలిరా సభను విజయవంతం చేసి తీరుతామని ఎమ్మెల్యేలు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్ తెలిపారు. అధికారం అండతో సభను అడ్డుకోలేరని, కుట్రలు మానుకోకుంటే ప్రజాక్షేత్రంలో తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. వచ్చే లక్షల మందికి ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాటుచేసే పనిలో ఉన్నామని, ఎటువంటి అవాంతరాలు లేకుండా యంత్రాంగం, అధికారులు సహకరించి సభ విజయవంతం చేయడానికి సహకరించాలన్నారు.



ప్రాంగణం పక్కనే హెలిప్యాడ్ కోసం ఏర్పాట్లు



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సాంబశివరావు, రవికుమార్

కేసు పెడతారంట



రా.. కదిలిరా సభకు ఇష్టపూర్వకంగానే పొలం ఇచ్చాను. దానికి అంగీకార పత్రం ఇచ్చాను. దేవదాయశాఖ అధికారులు ఫోన్ చేసి కేసు పెడతామని బెదిరించారు. ఎవరు నన్ను భయపెట్టి ఇవ్వద్దని చెప్పినా నిర్ణయం మారదు. ప్రజల కోసం చంద్రబాబు వస్తుంటే అడ్డంకులు పెట్టడం సరికాదు.

- కరి వీరనారాయణ, రైతు

'హోటల్' కోర్సులో ప్రవేశానికి
ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీహెచ్‌ఎంసీటీ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 11995 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తిరుపతిలోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 60, హైదరాబాద్‌లోని సెంట్రల్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 285, స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎం-డా.వైఎస్సార్ ఎన్ఐటీహెచ్‌ఎంలో 120, శ్రీశక్తి ఐహెచ్‌ఎం(ప్రైవేట్ కళాశాల)లో 120, మెదక్‌లోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్‌ఎంలో 60 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు బోధిస్తారు. ల్యాబ్ వర్క్‌లు కూడా ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ లెవెల్ జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) ఎగ్జామినేషన్(లండన్/కేంబ్రిడ్జ్/శ్రీలంక) ఉత్తీర్ణులు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎస్‌బీఓఎస్) నుంచి సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేష్ ఉత్తీర్ణులు; ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు; ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 2 నుంచి 5 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం
- **ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈ తేదీ:** మే 11
- **వెబ్‌సైట్:** https://nchm.ntaonline.in/, https://exams.nta.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఎంబీఏ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఏబీవీఎస్ఎంఈ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. క్యాట్ 2023 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్(కనీసం 500) ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. సీట్ల సంఖ్యకు ఏడురెట్ల మందిని ఎంపిక చేసి గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పంపుతారు. క్యాట్ 2023 స్కోర్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్స్ స్కోర్‌నకు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌నకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ మెరిట్ ప్రకారం తుది జాబితా రూపొందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in

దిక్సూచి
DIKSUCHI

ఏపీలో ఎస్ఏ, ఎస్జీటీ ఉద్యోగాలు

జాబ్ కార్నర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్.. వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఖాళీల భర్తీకి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ/డీఎస్సీ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 4,579 ఎస్ఏ/ఎస్జీజీ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఖాళీలున్న విద్యాసంస్థలు: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్.

పోస్టుల వివరాలు:
1. స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ): 2,299 పోస్టులు
2. సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ): 2,280 పోస్టులు

ఉమ్మడి జిల్లాల వారీ ఖాళీలు
1. శ్రీకాకుళం: ఎస్జీటీ-104; ఎస్ఏ-130
2. విజయనగరం: ఎస్జీటీ-103; ఎస్ఏ-97
3. విశాఖపట్నం: ఎస్జీటీ-101; ఎస్ఏ-133
4. తూర్పుగోదావరి: ఎస్జీటీ-108; ఎస్ఏ-182
5. పశ్చిమ గోదావరి: ఎస్జీటీ-102; ఎస్ఏ-145
6. కృష్ణా: ఎస్జీటీ-103; ఎస్ఏ-111
7. గుంటూరు: ఎస్జీటీ-109; ఎస్ఏ-170
8. ప్రకాశం: ఎస్జీటీ-111; ఎస్ఏ-299
9. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు: ఎస్జీటీ-104; ఎస్ఏ-140
10. చిత్తూరు: ఎస్జీటీ-101; ఎస్ఏ-97
11. కడప: ఎస్జీటీ-105; ఎస్ఏ-81
12. అనంతపురం: ఎస్జీటీ-107; ఎస్ఏ-164
13. కర్నూలు: ఎస్జీటీ-1022; ఎస్ఏ-550

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగం/సబ్జెక్టుల్లో ఇంటర్, డీఈడీ/డీఎల్ఈడీ, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారు అర్హులు.

వయోపరిమితి: ఓసీలకు 2024 జూలై 1 నాటికి 44 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు గరిష్ఠ వయోపరిమితిగా నిర్ధయించారు.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిజర్వేషన్ రూల్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.750


ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: ఫిబ్రవరి 21

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22

రాత పరీక్ష షెడ్యూల్: 2024 మార్చి 15 నుంచి 2024 మార్చి 30 వరకు

వెబ్‌సైట్: apdsc.apcfss.in

టీఎస్ ఈసెట్ నోటిఫికేషన్



తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్‌ఈసెట్)2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. దీని ద్వారా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంక్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఈసెట్ 2024 విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, మెటలర్జికల్, మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫార్మసీ.

అర్హత: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు బీఫార్మసీ కోర్సుకు అనర్హులు. డిప్లొమా/డిగ్రీ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఈసెట్ 2024 వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.

- డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/కెమికల్/మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఈసెట్ 2024లో అర్హత పొందాలంటే కనీసం 50 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 16
- **టీఎస్ ఈసెట్ 2024 తేదీ:** మే 6
- **వెబ్‌సైట్:** ecet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zQsa13eలో చదవండి.

ఐఐపీలో ఎంఎస్, పీజీ డిప్లొమా

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్) 2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: హైద్రాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది.

పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ డిప్లొమాలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ/లైఫ్ సైన్సెస్/మెటీరియల్ సైన్స్/బయోటెక్నాలజీ/జువాలజీ/బోటనీ/అగ్రికల్చరల్ సైన్సెస్/హార్టికల్చరల్ సైన్సెస్/వెటర్నరీ సైన్సె స్/డెయిరీ సైన్స్/ఫుడ్ సైన్స్ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్/ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంట్ సైన్స్/పాలిమర్ కెమిస్ట్రీ/ఫిషరీ సైన్స్/నానో సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్/బీఫార్మసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైమ్ డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

ఐఐపీ సెట్ 2024 వివరాలు: దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **చివరి తేదీ:** జూన్ 8
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూన్ 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 28, 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

నవ్య | చిత్రజ్యోతి

బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు బన్నీ



'పుష్ప' చిత్రంతో ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకొని సత్తా చాటారు అల్లు అర్జున్. ఇప్పుడు ఆయన మరో అరుదైన గౌరవాన్ని పొందారు. ప్రతిష్ఠాత్మక బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమా తరపున ప్రాతినిథ్యం వహించే అవకాశం అల్లు అర్జున్‌కు దక్కింది. 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. దీంతో గురువారం బన్నీ జర్మనీ వెళ్లారు. 'పుష్ప' సినిమాను ఈ చిత్రోత్సవాల్లో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది.

అందాల రాశికి అందలం



అందం, అభినయం కలగలిసిన ముద్దుగుమ్మగా ప్రేక్షకలోకాన్ని ఆకట్టుకున్నారు టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న. ఇప్పుడు ఆమె మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో రష్మిక చోటు దక్కించుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉన్న 30 మంది ప్రతిభావంతుల జాబితాలో రష్మిక అగ్రస్థానం దక్కించుకున్నారు. సోషల్ మీడియా ద్వారా రష్మిక ఈ విషయాన్ని అభిమానులతో పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఆమె ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే 'రెయిన్ బో' 'ది గర్ల్‌ఫ్రెండ్' అనే హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి.

రాజధాని ఫైల్స్‌కు తాత్కాలిక బ్రేక్

- రికార్డులు పరిశీలించాలి.. వాటిని మా ముందు ఉంచండి
- సీబీఎఫ్‌సీ, రివైజింగ్ కమిటీ అధికారులకు హైకోర్టు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా



రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు హైకోర్టు గురువారం ప్రకటించింది. నిబంధనల ప్రకారం తగిన కారణాలు పేర్కొని సినిమా విడుదలకు రివైజ్ కమిటీ సర్టిఫికెట్ ఇచ్చిందా.. లేదా అనేది పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడింది. సినిమాకు సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీల వద్ద ఉన్న రికార్డులను ఈ నెల 16లోగా కోర్టు పరిశీలనకు ఉంచాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ), రివైజింగ్ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను ఆదేశించింది. సినిమా విడుదలైతే పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్న పిటిషనర్ వాదనను పరిగణలోకి తీసుకొని సినిమా ప్రదర్శనపై శుక్రవారం వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. రికార్డులు కోర్టు ముందు ఉంచేందుకు వీలుగా విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేలా రాజధాని ఫైల్స్ సినిమాను తీశారని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ధ్రువపత్రాన్ని రద్దు చేయాలని కోరతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీకి నిర్ణయాన్ని వాయిదా వేసింది. గురువారం సినిమా ప్రదర్శనను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

థియేటర్లలో ప్రదర్శన నిలుపుదల

రాజధాని అమరావతి రైతుల ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన 'రాజధాని ఫైల్స్' చిత్రానికి బ్రేకులు పడ్డాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ చిత్ర ప్రదర్శనను నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులు థియేటర్ యాజమానులను ఆదేశించారు. గురువారం రిలీజైన ఈ చిత్రాన్ని ఉమ్మడి కృష్ణాలో 26 థియేటర్లతో పాటు కొన్ని మల్టీప్లెక్స్‌ల్లోనూ విడుదల చేశారు. ఉదయం ఆట మొదలయ్యే సరికి రెవెన్యూ అధికారులు థియేటర్లకు వచ్చి.. ప్రదర్శనలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు వెళ్లే సరికి కొన్ని థియేటర్లలో ప్రదర్శనలు మొదలయ్యాయి. ఆయా థియేటర్లలో మాత్రం మేనేజర్లు కోర్టు తీర్పు కాపీని ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆ ఉత్తర్వులను టికెట్ కౌంటర్ల వద్ద అతికించారు. మ్యాట్నీ నుంచి పూర్తిగా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ట్రెండ్‌సెట్‌లో ప్రదర్శనను మధ్యలోనే ఆపేయడంతో ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. అధికారులు వారికి కోర్టు ఆదేశాలను చూపించడంతో ఆందోళన విరమించారు. కాగా, ఏలూరులోని విజయలక్ష్మి థియేటర్ (వి మాక్స్)లో ఈ సినిమా గురువారం 11 గంటలకు ప్రారంభం కాగా రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి ప్రేక్షకులను పంపించి వేశారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)



భైరవకోన బావుందంటున్నారు



"ఊరుపేరు భైరవకోన' చిత్రానికి వంద ప్రీమియర్ షోలు పడ్డాయి. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. 'సినిమా హిట్. చాలా బావుంది' అంటున్నారు" అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊరుపేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. అనిల్ సుంకర మాట్లాడుతూ "ఊరుపేరు భైరవకోన' ప్రీమియర్స్‌కు ఇలాంటి స్పందన ముందే ఊహించాం. సినిమా అద్భుతంగా ఉందని ప్రేక్షకులు చెప్పడం విజయంపై నమ్మకాన్ని పెంచింది' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ 'ప్రీమియర్ షోస్ అన్నీ హౌస్ ఫుల్ అయ్యాయి. ప్రేక్షకులను మెప్పించినందుకు ఆనందంగా ఉంద'న్నారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'రెండున్నరేళ్లు కష్టపడి ఈ సినిమా చేశాం. కంటెంట్‌ను నమ్మి వంద ప్రీమియర్ షోస్ వేశాం. రూ. కోటి పైన వసూళ్లు రావడం ఈ సినిమా క్రేజ్‌కు నిదర్శనం' అని పేర్కొన్నారు. 'ఊరు పేరు భైరవ కోన' సినిమా విడుదలపై స్టే ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌లో స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.

పద్మవ్యూహంలో ప్రేమకథ



ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా శశికాటిక్కో, ఆషురెడ్డి కీలకపాత్రల్లో నటిస్తున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'పద్మవ్యూహంలో చక్రధారి' అనే టైటిల్‌ను చిత్రబృందం నిర్ణయించింది. ప్రవీణ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలో తొలి ప్రేమ ఉంటుంది. అందులో కొందరు సఫలం అయితే మరికొందరు విఫలమవుతారు. అలా తన తొలిప్రేమ జ్ఞాపకాల నుంచి బయటపడి జీవితంలో ముందుకు సాగడానికి ఓ వ్యక్తి అనుభవించిన సంఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'రాయలసీమ అనగానే పగ, ప్రతీకారాలు మాత్రమే అనేలా ప్రచారంలో ఉంది. కానీ మా చిత్రంలో ఈ ప్రాంతంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమని చూపించబోతున్నాం' అన్నారు.

హర్షను హీరోగా ఆదరించండి

చిరంజీవి

సుందరం మాస్టర్ చిత్రం ట్రైలర్ చాలా బావుంది. హర్ష కోసమే ఈ పాత్ర పుట్టినట్లుంది. తన ప్రతిభను నమ్ముకొని హర్ష ఓ స్థాయికి వచ్చాడు. ఇప్పుడు హీరోగా ఎదిగాడు. హాస్యంతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న సినిమా ఇది. ఇలాంటి వినూత్న ప్రయోగాలను ప్రేక్షకులు ఆదరించాలి. 'సుందరం మాస్టర్' చిత్రానికి పెద్ద విజయాన్ని అందించాలి' అని చిరంజీవి ప్రేక్షకులను కోరారు. హర్ష చెముడు, దివ్యశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సుందరం మాస్టర్'. హీరో రవితేజ, సుధీర్



కుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 23న విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రస్తుతం అమెరికా విహార యాత్రలో ఉన్న చిరంజీవి ఆన్‌లైన్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ "సుందరం మాస్టర్' చిత్రం చాలా కొత్త పాయింట్‌తో రాబోతోంది. మనలో ఒకడిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. అందరినీ ఆలోచింపజేసే చిత్రమిది. కామెడీతో పాటు అద్భుతమైన డ్రామా ఉంది' అన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Asbx5Tv లో చదవండి.

తెనాలి జీజీహెచ్‌లో ప్రపంచ బ్యాంకు బృందం ...



తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలను గురువారం వరల్డ్ బ్యాంక్ టీం సభ్యులు సందర్శించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణినితో చర్చించారు. ఈ సభ్యుల బృందం మూడు రోజులు ఆసుపత్రిని సందర్శించనున్నదని వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి తెలిపారు.

- తెనాలి రూరల్

బరితెగించిన వైసీపీ ఇసుక దొంగలు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో వైసీపీ ఇసుక దొంగలు రోజురోజుకు మరీ బరితెగిస్తున్నారని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణంలోని ఆయన నివాస గృహంలో గురువారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. ఇసుక అక్రమాలు నిజం అడ్డగోలు తవ్వకాలు వాస్తవమని కేంద్ర ప్రభుత్వమే హైకోర్టుకు తెలిపిందంటే ఇక్కడ పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చన్నారు. తాడేపల్లి ప్యాసెల్ అండ చూసుకొని ప్రశ్నించిన వారిని కొట్టడానికి, చంపటానికి కూడా ఈమాఫియా వెనుకాడటం లేదన్నారు. మాఫియా విషయాలను వెల్లడించే విలేకరులను పట్టి బంధించి హత్యాయత్నాలు చేయడం చాలా ప్రమాదకర పరిణామం అన్నారు. రోజుకు రెండు వేలకు పైగా లారీలతో ఇసుక ఇక్కడి నుంచి బయట రాష్ట్రాలకు తరలి పోతోందని, రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు నెలకు ఇసుక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, చాలా కాలం క్రితం తమ పార్టీ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి గుర్తు చేశారు. ఇసుక దీక్షల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, ఇసుక రీచ్‌ల సందర్శనలు చేపడితే పోలీసు పవర్‌తో అడ్డుకున్న జగన్ ప్రభుత్వం తమ దోపిడీ పర్వాన్ని యథేచ్ఛగా సాగిస్తుందన్నారు.

క్రైస్తవులకు మొండిచేయి చూపిన జగన్‌రెడ్డి

● డాక్టర్ జోసఫ్ పీ.మోసిగంటి



జోసఫ్ పీ మోసిగంటి

చేబ్రోలు, ఫిబ్రవరి15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 25 శాతంగా ఉన్న క్రైస్తవ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి క్రైస్తవులను మొండిచేయి చూపారని ఆంధ్రప్రదేశ్ జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ పీ. మోసిగంటి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ తమ వాడు అనుకొని 98శాతం మంది క్రైస్తవులు ఓట్లు వేశారన్నారు. గెలిపించిన తర్వాత కనీసం కృతజ్ఞత చూపలేదన్నారు. నామినేటెడ్ పోస్టులు, కోఆప్టెడ్ పోస్టులు దాదాపు 800 వరకు ఉండగా ఏ ఒక్కటీ క్రైస్తవ సమాజానికి సేవ చేసేవారికి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 80వేల మంది పాస్టర్లు ఉంటే కేవలం 8,500 మందికి మాత్రమే రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో చర్చిల మీద, క్రైస్తవుల మీద దాడులు పెరిగాయని ఆరోపించారు. ఇంతకు ముందు బైబిల్ ఇచ్చి అమ్మను, చెల్లిని పంపిన జగన్ ఇప్పుడు విమలారెడ్డిని పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత నాలుగున్నర ఏళ్లగా విమలారెడ్డి ఒక్క క్రైస్తవ సమస్య మీద కూడా స్పందించలేదని ఆరోపించారు. క్రైస్తవ సమాజం అప్రమత్తంగా ఉండి ఇలాంటి వారిని నిలదీయాలని డాక్టర్ జోసఫ్ పీ మోసిగంటి సూచించారు.

మేటల్లోనూ.. మేత

● కృష్ణానదిని ఖాళీ చేసి, పట్టా భూములపై పడ్డారు
● పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను నిషేధించిన ప్రభుత్వం
● అయినా అనుమతులు లేకుండా అడ్డగోలు తవ్వకాలు
● రైతులను మభ్యపెట్టి డబ్బు ఆశ చూపించి ఇసుక స్వాహా



లారీలను వదిలేసి ట్రాక్టర్లను తీసుకు వెళుతున్న ఎస్ఈబీ అధికారి

కొల్లూరు, ఫిబ్రవరి 15: కృష్ణానదిలో ఇసుక రేణువు లేకుండా ఖాళీ చేశారు.. రైతుల పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలపై పడ్డారు. ప్రభుత్వం పట్టా భూముల్లో ఇసుక మేటల తవ్వకాలు నిషేధించింది. తమకు అటువంటివేమి వర్తించవంటూ అడ్డగోలుగా భారీ యంత్రాలతో రైతులకు డబ్బు ఆశ చూపించి భారీ యంత్రాలతో అక్రమంగా ఇసుక తవ్వేసి జేబులు నింపుకొంటున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంకలో అరవింద వారధి ఎగువన రైతుల భూముల్లో వరదలకు నదీపాతానికి గురయ్యే వాటిలో వరదల సమయంలో ఇసుక మేటలు భారీగా ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసింది. నదుల్లో ఉన్న ఇసుక తవ్వకాలు రాష్ట్రాన్ని మూడుగా విభజించి గుంపగత్తుగా జేపీ సంస్థకు అప్పగించింది. జేపీ సంస్థ కాలపరిమితి తీరిపోయిన ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ టీడీపీ వారి అక్రమాలను బయటకు తీయడంతో ప్రభుత్వం మరో సంస్థకు ఇసుక తవ్వకాలకు అప్పగించింది. అయితే కొల్లూరు మండలం గాజుల్లంక పరిధిలో ఉన్న కృష్ణా నదిలో ఎక్కడా ఇసుక లేకపోవడంతో జీసీకేసీ కన్ను నదీ అంచున ఉన్న పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలపై పడింది. దీంతో ఆయా రైతులతో బేరసారాలు సాగించి ఎకరం భూమిలో వేసిన ఇసుక మేటలు తొలగింపు రూ.1.70 లక్షలు రైతులకు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం అయిన వెంటనే భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలను ప్రారంభించారు. అయితే నిషేధించిన పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకుని అనుమతులు చూపించాలని సంస్థ నిర్వాహకులను ప్రశ్నించగా నదిలో ఇసుక తవ్వకాలను ఇచ్చిన అనుమతులను చూపిస్తూ అడ్డుకుంటున్న వారిని డబ్బు ఎర వేస్తూ ఇసుక తవ్వకాలను కొనసాగిస్తున్నారు. భారీ యంత్రాలతో అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల సాగు, తాగు నీటి ఇబ్బందులు తలెత్తడంతో పాటు వరదల సమయంలో పంట పొలాలు, గ్రామాలు కోతకు గురవుతాయని రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ఎవరూ లెక్కచేయకపోగా ఇష్టానుసారంగా భారీ గోతులు పెట్టి మరీ ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా లంక గ్రామాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అక్రమ ఇసుక తవ్వకాలను నిలువరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పట్టా భూముల్లో జరిగిన ఇసుక తవ్వకాలు

దాడుల్లోనూ దాపరికం..

అరవింద వారధి సమీపంలో అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ లంక గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్, ఎస్ఈబీ అధికారులు గురువారం మధ్యాహ్నం ఇసుక రీచ్‌పై ఆకస్మిక దాడి చేశారు. దాడుల్లో మూడు భారీ యంత్రాలతో పాటు లారీలు, ట్రాక్టర్లు పంపించి వేసి భారీ యంత్రాలను సీజ్ చేస్తున్నట్లుగా మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ విలేకర్లకు తెలిపారు. లోడ్ అయి వున్న 15 లారీలను విడిచి పెట్టి రెండు ట్రాక్టర్లను మాత్రం వే బిల్లులు లేవంటూ కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దాడులపై వివరణ కోరినా సరైన సమాధానం ఇవ్వలేదు. అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకునే బాధ్యత సెబ్ అధికారులు తీసుకుని వారు నియంత్రించాలంటూ తమ బాధ్యత కాదన్న రీతిలో సమాధానం ఇవ్వడంతో పాటు విలేకర్లకు భారీ యంత్రాలు మూడింటిని సీజ్ చేసినట్లుగా పోలీసులకు నివేదిక ఇచ్చామని చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయంపై ఏఎస్ఐ అర్జున్‌ను వివరణ కోరగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు రాజేష్‌కుమార్ వేబిల్లులు లేకుండా వెళుతున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తమకు అప్పగించినట్లుగా మాత్రమే తమకు రిపోర్టు ఇవ్వడం జరిగిందన్నారు. యంత్రాల సంగతి తమకు తెలియదంటూ వివరించారు. ఇసుక తవ్వకందారులు మాత్రం మైనింగ్, సెబ్ అధికారులు వెళ్లిన వెంటనే మళ్లీ భారీ యంత్రాలను పట్టా భూముల్లోకి తీసుకెళ్లి తవ్వకాలు చేపట్టారు. అక్రమ ఇసుక తవ్వకాలతో పాటు ఇసుక మాఫియాకు పూర్తి అండదండాలు అధికార పార్టీ నేతలతో పాటు ఇసుక మాఫియా వద్ద నుంచి మైనింగ్, సెబ్ అధికారులకు ముడుపులు అందుతున్నట్లు సమాచారం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వచ్చి హడావుడి చేసి ఫిర్యాదు చేసి తమ పని అయిపోయినట్లుగా చెప్పి వెళ్లిపోతున్నారు. ఇందుకు ఉదాహరణగా మైనింగ్ ఏడీ మూడు భారీ యంత్రాలను సీజ్ చేయకుండానే చేశామంటూ నమ్మబలికి పోలీస్‌స్టేషన్‌లో మాత్రం కేవలం రెండు ట్రాక్టర్లు అప్పగించడంతో ఇసుక మాఫియాదారులకు వారి సహాయ సహకారాలు పూర్తిగా ఉన్నాయని ఈ చర్యతో స్పష్టమైంది.



ఇసుక తవ్వకాలు నిలిపి యంత్రాలను ఒడ్డుకు తరలించిన మైనింగ్ అధికారులు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతి శాశ్వతం..

● 1521వ రోజుకు రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 15: ప్రభుత్వాలు మారుతుంటాయి.. కానీ రాజధాని అమరావతి శాశ్వతమని రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ రైతులు రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1521వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో వైసీపీ నేతలు వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. సీఎం జగ్‌రెడ్డి రాజధాని రైతులపై ఎందుకు వివక్షత చూపుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. మూడు రాజధానులని ఆంధ్రప్రదేశ్ ఉనికినే సీఎం జగన్‌రెడ్డి దెబ్బ తీశారన్నారు. వైసీపీ పాలకుల అవినీతితో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారన్నారు. ఇటువంటి అబద్దాల, ఆర్థిక ఉన్మాదికి ఒక్క క్షణం కూడా రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.



సంగం డెయిరీని పరిశీలిస్తున్న కేరళ రాష్ట్ర డెయిరీ కో-ఆపరేటీవ్ సమాఖ్య మిల్మా చైర్మన్ కేఎస్ మణి తదితరులు

సంగం డెయిరీ సహకారం మరువలేనిది

● మిల్మా చైర్మన్ కేఎస్ మణి .. డెయిరీ సందర్శన

చేబ్రోలు, ఫిబ్రవరి15: గత రెండేళ్లుగా కేరళ రాష్ట్ర డెయిరీ కోఆపరేటీవ్ సమాఖ్య మిల్మాకు సంగం డెయిరీ అందచేస్తున్న సహకారం మరువలేనిదని ఆ సంస్థ చైర్మన్ కేఎస్ మణి అన్నారు. గురువారం కేరళ మిల్మా చైర్మన్ మణి, ఆ రాష్ట్ర పాల సంఘాల చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు సంగం డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా సంగం డెయిరీలో పాల ప్రాసెసింగ్ యూనిట్లు, పాలు, పాల పదార్థాల తయారీ, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజీలు, రవాణా యూనిట్లను సందర్శించారు. అనంతరం సంగం చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, ఎండీ పి.గోపాళ్ల కృష్ణను మణి తదితరులను సత్కరించారు. అనంతరం మణి మాట్లాడుతూ సంగం డెయిరీ ఉద్యోగుల సామర్థ్యంతో ప్లాంట్ నిర్వహణ తదితర అంశాలు అధునాతన పద్ధతులతో సాగిస్తున్నట్లు అభినందించారు. తమకు సహకరిస్తున్న చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు మిల్మా అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మిల్మాను సందర్శించాలిందిగా చైర్మన్ నరేంద్రకుమార్, అధికారులను కోరారు. కార్యక్రమాలో మిల్మా బృందం, సంగం డెయిరీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పిన్నెల్లి సోదరులను ప్రజలు తరిమికొడతారు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూ నాయక్

గుంటూరు, ఫిబ్రవరి 15: రాక్షసుల మాదిరిగా ప్రవర్తిస్తున్న పిన్నెల్లి సోదరులను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యకుడు ఎం.ధారూనాయక్ హెచ్చరించారు. మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం పాటిమీద జంగమేశ్వరపురం గ్రామంలో వైసీపీకి చెందిన దుండగులు తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు కార్యకర్తలపై దాడి చేసి నరకటం అమానుషమన్నారు. వారిలో ఇద్దరి పరిస్తితి విషమంగా ఉందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో టీడీపీకి చెందిన బీసీ నాయకులను 7 గురిని చంపారన్నారు. గతంలో అదే గ్రామంలో కంచర్ల జల్లయ్య యాదవ్‌ని చంపారన్నారు. ఐదుగురి కాళ్లు నరికారన్నారు. ఇళ్లు తగులబెట్టారన్నారు. పొలాలు వేసుకోకుండా బయట నివసిస్తున్నారన్నారు. మళ్లీ ఇప్పుడు నలుగురి కాళ్లు నరికారన్నారు. వారిలో కొంతమంది చావు బతుకుల్లో ఉన్నారన్నారు. ఈ విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల మీద దాడులు చేస్తూనే ఉన్నారన్నారు. దీనిని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇలాంటి రౌడీలను తరిమి కొట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15: ఆర్టీసీ బస్సులో సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు హైదరాబాద్‌కు చెందిన షహనాజ్ మొదటి పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..చిలకలూరిపేటకు చెందిన షహణాజ్ వినుకొండలో బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆభరణాలు ఏ ప్రదేశంలో చోరీకి గురైయ్యాయో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.39 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

వివాహిత దారుణ హత్య



అలేఖ్య(ఫైల్)

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 15: వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని గంగానమ్మపేటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవనంవారి వీధిలో నివాసం ఉంటున్న రామిశెట్టి అలేఖ్య(35)కు ఆడిటర్‌గా పనిచేసే రమేష్‌తో 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. కాగా అన్నంశ్రీనివాస్ అనేవ్యక్తి తన భార్యను కొంతకాలంగా వేధిస్తున్నాడని రమేష్ తెలిపాడు. బుధవారం రాత్రి ఇంటిలో పై గదిలో రమేష్ నిద్రించాడు. కింది గదిలో భార్య అలేఖ్య నిద్రించింది. ఉదయం లేచి చూసే సరికి అలేఖ్య మృతదేహం నగ్నంగా పడి ఉందని గమనించి భర్త పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆమెను పదునైన ఆయుధంతో గొంతు కోసి హత్య చేశారు. శ్రీనివాస్‌కి ఈఘాతుకానికి పాల్పడ్డాడని రమేష్ చెబుతున్నాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్ చెప్పారు.

వైసీపీకి దొడ్డక దంపతుల రాజీనామా



దొడ్డక కృష్ణ, శివపార్వతి

మంగళగిరి, ఫిబ్రవరి15: మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, దొడ్డక కృష్ణ దంపతులు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు గురువారం ప్రకటించారు. తమను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మనుషులుగా భావించి, పార్టీ కార్యక్రమాలకు దూరం పెడుతున్నారని తెలిపారు. తాము వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడుతున్నామని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని అందల మెక్కించి తమకు కనీస గుర్తింపు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలకు తీవ్ర మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

గుంటూరు, ఫిబ్రవరి 15: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడైన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. గురువారం నగరం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన హత్య కేసులో నిందితుడైన మాదల సాంబశివరావు అనే నిందితునికి నేరం రుజువు కావడంతో అతనికి జీవితకాలం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి అయిన ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ రావు, ప్రస్తుతం సీఐడీ డీఎస్పీగా పని చేస్తున్నారని, ప్రాసిక్యూషన్ తరుపున పీపీ అయిన వెంకటరెడ్డి వాదనలను వినిపించారని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి, అందుకు సంబంధించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు. జిల్లాలో పోలీసు అధికారులే స్వయంగా గ్రేవ్ కేసులలో కోర్టు ట్రయిల్‌ను పర్యవేక్షించడం వలన నిందితులకు కోర్టుల ద్వారా వేగంగా శిక్షలు పడుతున్నాయని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

వాస్తవాలను తట్టుకోలేక పోతున్నాడు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15: వాస్తవ సన్నివేశాలను కళ్ళకు కట్టినట్టుగా ప్రజల ముందుకు తీసుకువచ్చిన రాజధాని ఫైల్స్ సినిమాచూసి సైకో సీఎం జగన్‌రెడ్డి గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నా యని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం అడ్డుపెట్టుకొని సినిమాను నిలిపివేయడం ఆయన నీచ చరిత్రకు నిదర్శనమన్నారు. ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. రాష్ట్ర రాజధాని విషయంలో రాజధాని రైతు లను జగన్‌రెడ్డి అరాచకపాలన చేసిన దుర్మార్గాలను, దౌర్జన్యా లను, దాడులను వాస్తవ సన్నివేశాలకు దగ్గరగా చూపారనే అక్కసుతో సినిమాను అడ్డుకుంటున్నారని అన్నారు. రాజధాని నిర్మించటం చేత కాక ఓటమి భయం పట్టుకున్న జగన్‌రెడ్డి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌కు వణుకు

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 15: రాజధాని ఫైల్స్ సినిమాకు జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. 34వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా నిలిచింది. అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు తెలిపిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో మాటమార్చాడన్నారు. జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది కాబట్టి సైకో చేష్టలు చేస్తున్నారన్నారు. నిన్నటి దాకా మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ నేడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంటుందని అన్నారు. పక్క రాష్ట్రాల దగ్గర రాజధాని కావాలని అడుక్కునే స్థాయికి ఏపీనీ దిగజార్చారన్నారు. ఈ ఐదేళ్ళలో దోచుకోవటం దాచుకోవటం తప్పా రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● సూళ్లూరుపేట వద్ద లారీ ఢీకొని మృతి



గిరిధర్‌రెడ్డి(ఫైల్)

చిల్లకూరు, ఫిబ్రవరి 15: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలోని చుట్టుగుంట ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామానికి చెందిన గిరిధర్‌రెడ్డి (22) మూడేళ్లుగా సూళ్లూరుపేటలోని శ్రీసిటీలో పని చేస్తున్నాడు. స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేట నుంచి బయల్దేరగా చుట్టుగుంట వద్దకొచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గిరిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

1,19,823 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,248 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,19,823 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 94,535 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11500	15500
273	12500	16000
341	11000	20500
4884	9000	14500
సూపర్ 10	9000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21200
బ్యాడిగి	10000	21500
దేవనూరు డీలక్స్	9000	19500
తెల్లకాయలు	5000	13000

విద్యార్థి వికాసానికి సాహిత్య పఠనం అవసరం

● సామాజిక చైతన్యానికి నవలలు దోహదం
● ప్రముఖ వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు

పెదకాకాని, ఫిబ్రవరి 15 : విద్యార్థి వికాసానికి సాహిత్య పఠనం అవసరం అని ప్రముఖ వేద కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత రెండు రోజులుగా తెలుగు ప్రాచ్య భాష విభాగం ఆధ్వర్యంలో యూజీసీ సౌజన్యంతో 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం- సామాజిక చైతన్యంపై జాతీయ సదస్సు' నిర్వహిస్తున్నారు. గురువారం రెండవ రోజు కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడును తుంచడానికి పుట్టినదే అసలైన కవిత్వం అనీ, ధర్మావేశమే రచనకు బీజం అని అన్నారు. రచయితలు తమ భావాలను ఆలోచనాత్మకంగా అర్థవంతంగా అక్షరాలుగా మలచి మంచి సాహిత్యాన్ని అందిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు వేయి పడగలు వంటి ప్రముఖ రచనలను చదవాలని తద్వారా వారికి సమాజంపై సరైన ఆలోచన దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని తెలుగు ప్రాచ్యభాష విభాగం ఎంతో విశిష్టత కలిగిన 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం-సామాజిక చైతన్యంపై జాతీయ సదస్సు'ను నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు ప్రతీ నిత్యం ఒక్క పేజీ అయినా సాహిత్యానికి సంబంధించిన రచనలు చదవడం అలవాటు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. సామాజిక చైతన్యానికి నవలలు ఎంతగానో దోహద పడతాయని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ ఆచార్య పి రాజశేఖర్, విభాగాధిపతి, సదస్సు సంచాలకురాలు ఆచార్య ఇ. మాధవి, పాఠ్య ప్రణాళికా మండలి చైర్మన్ ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ పవన్, డాక్టర్ పీ.వాసు, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ బలరాం, పరిశోధకులు, వందలాది మంది విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ
ఆర్.ఓ.సి.నెం:2595/2023/ఇ1 తేది. 15.02.2024
ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు
నిట్ నెం.55/ఇ.టి.ఓ/2023-24
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ-సాధారణ నిధుల క్రింద మరియు యం.పి.యల్.ఏ.డి.యస్ నిధుల క్రింద మొత్తము 07 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీలయందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలువబడినది.
మొత్తము పనులు - 07 నెం.లు అంచనా వ్యయము రూ.82.39 లక్షలు
పని నెం: 01 నుండి 07 లకు :
1. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభ తేది. : ది.16-02-2024 ఉదయము గం.11.00.ని ల నుండి
2. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది : ది.23-02-2024 ఉదయము గం.11.00 ని.ల వరకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేదీ. : ది.23-02-2024 మధ్యాహ్నము గం.02.00 ని లకు
మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు. మొబైల్ నెం. 9849907303.
సం/- కమీషనరు,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ



ఉద్యోగావకాశాలు

➺ గుంటూరు సిటిలోని ప్రముఖ హాస్పిటల్ నందు పనిచేయుటకు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. సంప్రదించండి సెల్ : 70134 95900.
AJG-184656

➺ చేబ్రోలులో ఒక ప్రముఖ ప్రైవేట్ హైస్కూల్‌లో పనిచేయుటకు మాథ్స్ (ఇంగ్లీష్ మీడియం) టీచర్ కావలెను. సంప్రదించండి : ఫోన్ : 96422 54839
AJG-184556

➺ కోరల్‌డ్రా, ఫోటోషాప్‌లో మంచి అనుభవము గల గ్రాఫిక్ డిజైనర్ ఫుల్ టైమ్ గాని పార్టుటైమ్ గాని గుంటూరులో పనిచేయుటకు కావలెయును. స్వయంగా కలవండి. శాంతి ఆర్ట్ గ్యాలరీ, 4/3 అరండల్‌పేట, 2వ ఫ్లోర్, బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్, గుంటూరు. సెల్ : 99480 84001.
AJG-152150

➺ గుంటూరు జిల్లాలో సాంబ్రాణి కడ్డీలు, స్క్రబ్బర్స్, మార్కెటింగ్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. సంప్రదించండి సెల్ : 89774 82018.
AJG-184496

➺ గుంటూరు లక్ష్మీపురంలోని ప్రముఖ డెంటల్ హాస్పిటల్ నందు పనిచేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ మరియు హెల్పర్స్ (పార్ట్/ఫుల్ టైమ్) కావలెను. సంప్ర॥ 8500808778
AJG-184549

➺ కావలెను. కంప్యూటర్ అనుభవం గల డిగ్రీ అర్హత కలిగిన క్లర్క్ కావలెను. సంప్రదించండి : ఐటిసి లిమిటెడ్, చినకాకాని. ఫోన్ : 98481 39255
KC - 1227

పోయినవి

➺ దారా రాజా యేష్ S/o ప్రసాదరావు, డి.నెం. 11-9-17, పాండురంగపేట, తెనాలి. Gnt dt, A.P. నా యొక్క స్థలం డాక్యుమెంట్ నెంబర్ 1661/2017, 1662/2017 (SRO- [illegible]), తెనాలి [illegible] పోయినది. [illegible] ఈ నెంబర్ 92479 09615కు తెలుపగలరు.
AJG-184555

రియల్ ఎస్టేట్

➺ రాజధాని అమరావతిలో నిడుముక్కల నందు శ్రీహరి బృందావనంలో CRDA ప్లాట్స్ కలవు. బ్యాంకు లోన్ సదుపాయం కలదు. సంప్రదించండి:90301 85393.
AJG-184498


గోల్డ్ ఫైనాన్స్

➺ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి. ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును స్పాట్ క్యాష్. (100% జెన్యూన్) సంప్ర. సెల్ : 945 945 3338
AJB-181880

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు
ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం :
ఉ॥ 10:00 గం॥ల నుండి
సా॥ 06:00 గం॥ల వరకు
(సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	99639 84109
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : పట్టణాధ్యక్షుడు గోగినేని

రేపల్లె, ఫిబ్రవరి 15: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని టీడీపీ పట్టణాధ్యక్షుడు గోగినేని పట్టాభిరామారావు అన్నారు. గురువారం పట్టణంలోని టీడీపీ, జనసేన పార్టీలు బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. రాష్ట్రాభివృద్ధి చెందాలంటే టీడీపీ - జనసేన ప్రభుత్వంతోనే సాధ్యమని అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ టీడీపీకి మద్దతుగా నిలవాలని, జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలా కోటేశ్వరరావు, గుర్రం మురహరిరావు, మద్దుల అంకాలు, పంతాని సాయికుమార్, దేవగిరి రంగారావు, డొక్కు, బుజ్జి, నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలంటే బాబు రావాలి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 15: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ అన్నారు. గురువారం ఆళ్ళవారిపాలెం పంచాయతీలో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. అనంతరం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగ రూపకల్పనలో యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో రహదారులు నిర్మించాలంటే టీడీపీకే సాధ్యమని ఆయన ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జ్ వుయ్యూరు శివకృష్ణ, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

● డీఎస్పీ వెంకటేశులు



పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటేశులు

బాపట్ల, ఫిబ్రవరి 15: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు హెచ్చరించారు. ఈ విషయమై గురువారం బాపట్ల పట్టణ, రూరల్ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో బార్‌షాపుల యజమానులు రాత్రి 11గంటలలోపు షాపులు మూసి వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరమన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే సీజ్ చేసి కేసులు నమోదు చేసి కోర్టుకు పంపి స్తామని చెప్పారు. అర్ధరాత్రి సమయాల్లో యువత విచ్చలవిడిగా తిరగరాదన్నారు. అత్యవసర పరిస్థితులలోనే బయటకు రావాలన్నారు. బయటకొచ్చే సమయంలో గుర్తింపుకార్డు వెంట ఉండాలన్నారు. పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఎవరైనా అను మానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలన్నారు. ఎవరు కూడా వివాదాల్లో తలదూర్చరాదన్నారు. శాంతిభద్రతలకు ఆటం కం కలిగిస్తే ఎంతటి వారినైన వదిలిపెట్టే ప్రసక్తేలేదన్నారు. రాత్రుల సమయంలో ఎవరైన రహదార్లలో తిరిగినా షాపులు తెరిచి ఉంచినా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, రూరల్ సీఐ శ్రీహరి, సీఐ హజరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇమ్మడిశెట్టివారిపాలెంలో పారిశుధ్య పనుల పరిశీలన

బాపట్ల, ఫిబ్రవరి 15 : బాపట్ల పట్టణంలో 25వవార్డు ఇమ్మడిశెట్టివారిపాలెంలో గురువారం సిబ్బందితో కలిసి బాపట్ల మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీ కాల్వల్లో పూడిక తొలగించడంతో పాటు చెత్త నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచే విధంగా కార్మికుల ద్వారా పని చేయించాలని సిబ్బందికి సూచనలు చేశారు. అదేవిదంగా బాపట్ల పట్టణం 30వ వార్డు ఇస్లాంపేట వద్ద పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శివపార్వతులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, ఫిబ్రవరి 15: బాపట్ల పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీగంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఆలయ ఈవో డి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోన రఘుపతి రమాదేవి దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొని పూజలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. హోమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘుపతి మాట్లాడుతూ రూ.కోటి 10 లక్షలతో ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు. దీనికి మ్యాచింగ్ గ్రాంట్ రూ.25లక్షల 30వేలు చెల్లించగా మిగిలిన మొత్తం దేవదాయశాఖ నుంచి మ్యాచింగ్ గ్రాంట్ వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోళ్ళపూడి శివరామప్రసాద్, కొటికం సుబ్బారావు గురుస్వామి, లక్ష్మణమూర్తి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు : 16 బాటిళ్లు స్వాధీనం

బాపట్లరూరల్, ఫిబ్రవరి 15 : మండలపరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోలమ్మను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద ఉన్న 11 మద్యం సీసాలను గురువారం బాపట్ల రూరల్ సీఐ స్వాధీనం చేసుకున్నారు. వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుధీర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 5 మద్యంసీసాల ను స్వాధీనం చేసుకున్నట్టు బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు.

రక్తనాళ సంబంధిత వ్యాధుల నిపుణులు ఒంగోలు రాక
12 సంవత్సరాల అపార అనుభవము కలిగిన బృందం నుండి
డా. నరేంద్రనాద్ మేడా వారి వైద్య బృందం నుండి
డా॥ అజయ్. బి. మోసూర్
M.S General Surgery, DNB Vascular Surgery
Consultant Vascular & Endovascular Surgeon
KIMS Hospitals, Secunderabad.
ఈ నెల తేది. 18-02-2024, ఆదివారం
ఉ॥ 10గం॥ నుండి సా॥ 4గం॥ వరకు అందుబాటులో ఉంటారు
KIMS HOSPITALS
కిమ్స్ హాస్పిటల్
NH-5, నార్త్ బైపాస్ రోడ్డు, ఒంగోలు.
అపాయింట్‌మెంట్ కొరకు
08592 - 667788, 70958 78686, 77999 80904

SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం నంబ్ర 02,బోరం క్వా పార్క్, జనరల్4/1,TTC, దానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.
గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు
ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.
వేలం వేయు తేది: 26.02.2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇం.నం.27-2-7, జి.ఎన్.టి రోడ్, పద్మావతి ప్లాజా, 3వ అంతస్తు, ఏ కె నగర్ నెల్లూరు-524004

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
ADDAKPJ2308010001	TAMMISETTI RAVI	CHIRLPJ2308180001	DEGA KALPANA
CHIRLPJ2308080003	PALEKARI JALLENDRA RAO	CHIRLPJ2308300002	SHAIK KARISHMA
CHIRLPJ2308110002	VARI RUKMINI		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.బాబును సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.
తేది: 14.02.2024
స్థలం : నెల్లూరు
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రాష్ట్రానికి అప్పు పుట్టనిదే పూటగడవని పరిస్థితి

● రా కదలిరా కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలి
● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న నక్కా ఆనందబాబు

చుండూరు ఫిబ్రవరి 15: అన్నపూర్ణ లాంటి మన రాష్ట్రం జగన్ ఐదు సంవత్సరాల పాలనలో అప్పుల రాష్ట్రంగా మారింది అప్పు పుట్టనిదే పూట గడవని పరిస్థితులు రాష్ట్రంలో నెలకొన్నాయని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. గురువారం రాత్రి చుండూరులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆనందబాబు మాట్లాడుతూ అప్పులతోనే రాష్ట్రం నడుస్తుంది. కేంద్రం, ఇతర ఆర్థిక సంస్థలు అప్పులు ఇవ్వడం నిలిపివేస్తే పాలన కుప్పకూలే పరిస్థితులు నెలకొన్నాయి. లక్షల కోట్లు అప్పులు తెచ్చినా ఆ సొమ్ముతో రాష్ట్రాన్ని జగన్ అభివృద్ధి చేసింది కూడా లేదు. ఉద్యోగుల జీతాలకు నెలనెలా వెతుకులాట తప్పడం లేదు. ఇక రైతుల పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. చివరికి గత తుపాన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.500 కోట్లు కూడా రైతుకు అందించలేదు. రాష్ట్రంలో ప్రజలు ఎంత త్వరగా ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని జగన్‌ని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని ఆనందబాబు తెలిపారు. ఈనెల 17న ఇంకొల్లులో జరిగే రా కదలిరా బహిరంగ సభకు మండల, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకులు బుచ్చిరామ్‌ప్రసాద్, మద్దిరాల మ్యాని, తమ్మా శివారెడ్డి, గూడేటి బాలకోటిరెడ్డి, ఎల్లారెడ్డి, వీఎస్‌కె ప్రసాద్, కంఠంనేని రాహుల్, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, కుర్రి వెంకటరెడ్డి, భీమవరపు శ్రీమాన్, దేవిరెడ్డి నాగేశ్వరరావు, కావూరి శ్రీనివాసరావు, కేలం శ్రీనివాసరావు, మొవ్వా శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు సభను జయప్రదం చేయాలి

వేమూరు, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సమర శంఖం పూరించారని, ఇందులో భాగంగా ఈ నెల 17వ తేదీన శనివారం బాపట్ల నియోజకవర్గంలో ఇంకొల్లులో నిర్వహించనున్న రా కదలిరా కార్యక్రమానికి నియోజకవర్గ పరిధి నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. గురువారం వేమూరులోని టీడీపీ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రా కదలిరా కార్యక్రమం గోడప్రతిని ఆవిష్కరించారు.

రాష్ట్రంలో ఎన్నికల దగ్గర పడుతున్నాయని ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న జగన్మోహనరెడ్డికి బుద్ధి చెప్పేందుకు పార్టీ శ్రేణులు కసితో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీకి చెందిన అన్ని విభాగాల వారు జనసేన పార్టీ శ్రేణులను సమన్వయ పరుచుకుంటూ ముందుకు నడవాలన్నారు. వైసిపి ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి వ్యక్తికి తెలియజేసి చైతన్య పరచాలని టిడిపి ఇంత వరకు ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని అన్నారు. ఇప్పటికే ప్రజల్లో ఎంతో మార్పు వచ్చిందని ఆ మార్పు జగన్ పాలనపై వ్యతిరేకతనే సూచిస్తుందన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన పార్టీల సమష్టి పాలన రావడం తథ్యమని తద్వారా ప్రజాహిత పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి పార్టీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, చిట్టాబత్తిని చిట్టిబాబు, దొప్పలపూడి సుధాకర్, దండే వెంకట సుబ్బారావు, అమ్మిశెట్టి కిషోర్‌బాబు, షేక్ హనీఫ్, శివకృష్ణ, తులం రమేష్‌బాబు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.

అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలి

అమృతలూరు, ఫిబ్రవరి 15 : పార్టీ అభివృద్ధికి అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం మండలస్థాయిలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ బాపట్ల పార్లమెంటరీ స్థాయిలో ఈ నెల 17వ తేదీ ఇంకొల్లులో రా కదలి రా భారీ బహిరంగసభ జరగనున్నట్లు చెప్పారు. సమావేశంలో పార్టీ మండల పరిశీలకులు బుచ్చిరాంప్రసాద్, యలవర్తి బ్రహ్మానందం, గొట్టిపాటి భాను గంగాధర్, క్రొత్తపల్లి రవీంద్రబాబు, శరణు శేషగిరి, మట్లపూడి జయపాల్, మూల్పూరు ఏసురత్నం, బొంతా ఆంజనేయులు, బుచ్చి రాజు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం:

● సమస్యలు ఏకరువు పెట్టిన ఎంపీటీసీలు
● అనుమతుల్లేని ఇసుక తవ్వకాలను నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాంచారమ్మ

కొల్లూరు, ఫిబ్రవరి 15 : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. గురువారం ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు ఎంపీటీసీలు ప్రజా సమస్యలు తీర్చలేకపోతున్నామంటూ ఏకరువు పెట్టారు. గాజుల్లంక ఎంపీటీసీ బావిరెడ్డి వెంకట్రామయ్య మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా మండల గ్రామాల వెంట ఉన్న కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, దీని వల్ల రాబోయే వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై గత సమావేశాల్లో కూడా చెప్పినా ఇంతవరకు పరిష్కారం జరగలేదన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు నిలువరించి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మండలంలో అందుబాటులో ఉండాలని, చేసిన పనులు బిల్లులు అందజేయాలని మరో ఎంపీటీసీ కోరారు. జగనన్న కాలనీల్లో రహదారులు వేయించాలని చేసిన పనులు బిల్లులను తాత్సారం చేస్తున్నారంటూ సమావేశంలో అధికారుల దృష్టికి ఎంపీటీసీలు తీసుకువచ్చారని ఎన్‌ఆర్‌ఈజీ ఎస్ ద్వారా చేపట్టిన పనులు ఎవరికీ తెలియకుండా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 70 మంది కూలీలకు బిల్లులు ఇవ్వలేదన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎంపీటీసీలు లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిష్కరించి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈకేవైసీ, క్రాప్‌బుకింగ్‌లు సక్రమంగా ప్రతి రైతు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ఇళ్ల స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ లబ్ధిదారులు సక్రమంగా చేయించుకోవాలని లేని పక్షంలో అవి రద్దయ్యే ప్రమాదం ఉందన్నారు. పోతార్లంక లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీడీవో లక్ష్మీకుమారి, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటితో పురాణ కాలక్షేప మండప నిర్మాణం : ఈవో


బాపట్ల, ఫిబ్రవరి 15 : పట్టణంలో 1850వ సంవత్సరంలో పేరం గరుడాచలం నాయుడు నిర్మించిన తూర్పుసత్రంలో అపర కర్మలషెడ్‌ను నిర్మించి 100 సంవత్సరాల పైబడిన నందున ప్రజల సౌకర్యార్థం పురాణ కాలక్షేపమండపం కోటి రూపాయలతో నిర్మించతలపెట్టినట్లు ఈవో డి.వెంకటేశ్వర్లు తెలిపారు. వీటికి ఈనెల 18వ తేదీన శంకుస్థాపన జరుగుతుందన్నారు. సీజీఎఫ్ గ్రాంట్ కోటి రూపాయలకు మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.25లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. కావున దాతలు ముందుకు రావాలని కోరారు. ఎమ్మెల్యే కోన రఘుపతి రమాదేవి దంపతులు శంకుస్థాపన చేస్తారన్నారు. ఈ సమావేశంలో చాపల సుబ్రహ్మణ్యం, చిలకమర్తి శ్రీరామశర్మ, ఇనపగోళ్ళ రంగారావు, నర్రావుల వెంకట్రావు, కొండమూడి మారుతి, మాడసాని సుధాకర్, పెడాల మురళీరాం, బొమ్మిశెట్టి వెంకటరత్నగుప్తా, గోపాళంరెడ్డయ్య, గంటా సాయిబాబులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

బాపట్ల, ఫిబ్రవరి 15: మండలంలోని చెరువు గ్రామంలో నివాసం ఉంటున్న వృద్ధులకు జేసిఎన్ఎంఎం సర్వీస్‌ట్రస్ట్ ట్రస్ట్ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రకాశవర్ధిని, జోగి శ్యామసుందరి పాల్గొని చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోట సహదేవుడు, పాస్టర్ మోజెస్, సుజాత, జె.సుజ్ఞానం, దేవ పాల్గొన్నారు.

రొయ్యల చెరువులోకి ఇసుక కోసం పంటకాల్వ ధ్వంసం

బాపట్లరూరల్, ఫిబ్రవరి 15 : బాపట్ల మండలపరిధిలోని పిన్నిబోయన వారిపాలెం పంచాయతీ వల్లువారిపాలెం గ్రామశివారు పంటపొలాలలో ఉన్న ముత్తాయపాలెం ఫిటిచానల్ కాల్వను ఓ వ్యక్తి రొయ్యల చెరువులలోకి ఇసుక తీసుకునేందుకు పంటకాల్వను అడ్డదిడ్డాలుగా పగలగొట్టి పూర్తి స్థాయిలో జేసీబీలతో ధ్వంసం చేశారు. దీంతో రాబోయే వేసవికాలంలో రైతులకు చివర ఆయుకట్టుభూములకు ఈ ఫిటిఛానల్ కాల్వ ద్వారా సాగునీరు అందించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవ్వాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. వెంటనే సంబంధితాధికారులు ధ్వంసం చేసిన ఫిటిఛానల్ పంటకాల్వను మరమ్మతులు జరిపించాలని రైతులు కోరుతున్నారు.



పంట కాల్వను జేసీబీతో పగలగొట్టిన చిత్రం

పాఠశాలలో వార్షిక తనిఖీలు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 15 : చందోలు గ్రామపంచాయతీలోని రెడ్లపాలెం, ఎస్సీ కాలనీలలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షిక తనిఖీలలో భాగంగా ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల కు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యాబోధనందించటంతోపాటు జగనన్న గోరుముద్ద, యూనిఫామ్స్ పుస్తకాలు సక్రమంగా అందేవిధంగా చూసుకోవాలన్నా రు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం కిషోర్‌కుమార్, సమీమ్ సుల్తానా, సీఆర్పీలు ఎం ముసలయ్య పాల్గొన్నారు.

వాహన చోదకులు తమ వెంట పత్రాలు తెచ్చుకోవాలి

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 15: వాహనచోదకులు తమకు సంబంధించిన అనుమతిపత్రాలను వెంట పెట్టుకోవాలని చందోలు ఎస్ఐ టి.అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని చందోలు పెట్రోల్ బంకు కూడలిలో గురువారం తమ సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ అనీల్‌కుమార్ మాట్లాడుతూ అనుమతి పత్రాలు లేని వాహనాలను నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటంతోపాటు అపరాధ రుసుం విధించటం జరుగుతుందని తెలిపారు.

ఆలయంలో చోరీ : రూ.50 వేల నగదు అపహరణ

నగరం, ఫిబ్రవరి 15: స్థానిక శ్రీగంగా పార్వతీ సమేత ఉమామహేశ్వరిస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి హుండీ పగులకొట్టి సుమారు రూ.50 వేలపైన నగదును అపహరించారని ఆలయ అధికారులు తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గుడి సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

శివకోటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటు

రేపల్లె, ఫిబ్రవరి 15: శివకోటేశ్వరరావు మృతి పార్టీకి తీరని లోటని టీడీపీ రేపల్లె పట్టణ ఇన్‌చార్జ్ తాతా ఏడుకొండలు అన్నారు. మండలంలోని గుడ్డికాయలంకకు చెందిన వుయ్యూరు వెంకట శివకోటేశ్వరరావు (39) బుధవారం రాత్రి మృతి చెందటంతో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆ కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎమ్మెల్యే అందించిన రూ.20వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు ఏడుకొండలు, రామకృష్ణ, ధర్మతేజ అందించారు. ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

వలంటీర్ల కోసం ఆరు ఆర్టీసీ బస్సులు

కొల్లూరు, ఫిబ్రవరి 15 : ప్రభుత్వం వలంటీర్ల వందనం కార్యక్రమానికి ఆరు ఆర్టీసీ బస్సులు కేటాయించింది. గురువారం మండలంలోని 280 మంది వలంటీర్లను వందనం కార్యక్రమానికి తరలించేందుకు ఆర్టీసీ బస్సులను గ్రామాల్లోని సచివాలయాల వద్దకు పంపా రు. ప్రభుత్వ కార్యక్రమాలను ఆర్టీసీ బస్సులను వినియోగిస్తూ ఆర్టీసీ యజమాన్యం అదనపు భారం మోపుతుందని పలువురు విమర్శిస్తున్నారు.

పారదర్శకతకు ప్రాధాన్యం హర్షణీయం

● డాక్టర్ పీసీ సాయిబాబు

బాపట్ల, ఫిబ్రవరి 15: ఎన్నికల బాండ్లపై గురువారం సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పారదర్శకతకు ప్రాధాన్యమిస్తుందని ఫోరంఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల నిఘావేదిక కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు పేర్కొన్నారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ ఎన్నికల బాండ్ల వివరాలు ప్రజలకు వెల్లడి చేయాలని కోర్టు చెప్పటం ముదావహమన్నారు. రాజకీయపార్టీలకు భారీఎత్తున విరాళాలిస్తున్న కార్పొరేట్ కంపెనీల వివరాలు ప్రజలకు తెలియాల్సి ఉందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొల్లూరు, ఫిబ్రవరి 15 : గుర్తు తెలియని వ్యక్తి తెల్లవారు జామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం కొల్లూరు లాకు రోడ్డులోని జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాల ఎదురు ఉన్న ఓ దుకాణం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులు పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. ఎటువంటి గాయాలు లేకపోవడంతో చలి తీవ్రతకు తాళలేక మృతి చెందినట్లుగా గుర్తించారు. 15 రోజుల నుంచి ఈ వ్యక్తి గ్రామంలో తిరుగుతున్నాడని, అంతకు మించి వివరాలు ఏమి లేకపోవడంతో పంచాయతీ సిబ్బందికి అప్పగించి మృతదేహాన్ని ఖననం చేయించినట్లు ఏఎస్ఐ అర్జున్ తెలిపారు.

ప్రమాదంలో నలుగురికి గాయాలు

కొల్లూరు, ఫిబ్రవరి 15: ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పిం చే ప్రయత్నంలో జరిగిన ప్రమాదంలో నలుగురు గాయపడ్డ సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. క్రాప గ్రామానికి చెందిన కామినేని వెంకటేశ్వరరావు కొల్లూరులో ట్యూషన్ చదువుకుంటున్న తన కుమార్తెను ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళుతుండగా మొసలిపాడుకు చెందిన కట్టుపల్లి అజయ్, అశోక్‌లు కూడా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా వస్తు న్న కారు, లారీని తప్పించే క్రమంలో వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఆయన వాహనం లారీ వెనుక టైరును ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వరరావు, అతని కుమార్తె చంద్రిక కాళ్లు విరగ్గా, కట్టుపల్లి అజయ్ తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లాడు. అశోక్ అనే వ్యక్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు లారీని స్టేషన్‌కు తరలించి క్షత గాత్రులను 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
సంప్రదించండి 99854 11227 99854 02292

నేడు టీడీపీ మండల సమావేశం

కొల్లూరు, ఫిబ్రవరి 15: టీడీపీ మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కొల్లూరులోని ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో జరిగే సమావేశానికి మాజీ మంత్రి, పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు హాజరవుతారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

రా కదలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 15 : పర్చూరు నియోజకవర్గంలో ఈనెల 17వ తేదిన నిర్వహిస్తున్న రా కదలిరా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. ఈ విషయమై స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పీడిత వర్గాలను ఏకం చేసే లక్ష్యంతో తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు చేపట్టిన రా కదలిరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలోని ఇంకొల్లులో నిర్వహించే ఈ కార్యక్రమానికి బాపట్ల నియోజకవర్గం నుంచి 25వేల మంది కదలిరావాలని కోరారు. సమావేశంలో పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, టీడీపీ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు తోట నారాయణరావు, పిల్లి మాణిక్యారావు, వడ్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమిత్ర ఫ్యూయల్ స్టేషన్ ప్రారంభించిన వేగేశన

బాపట్ల పట్టణంలోని సూర్యలంకరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీమిత్ర ఫ్యూయల్ స్టేషన్‌ను గురువారం వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించారు. పర్యాటకులు, భక్తుల రాకపోకలతో రద్దీగా ఉండే సూర్యలంకరోడ్డులో ఫ్యూయల్‌స్టేషన్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, రమాదేవి దంపతులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌వీఆర్ఎం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మానం విజేత, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, నిర్వాహకులు తటవర్తి సుబ్రహ్మణ్యం గుప్తా, పడాల మురళీరావు, తాతా ఆంజనేయులు, ఎస్‌కే సైపుద్దీన్, ఎం శేషుకృష్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లులో రా.. కదలిరా సభను జయప్రదం చేయాలి : నల్లపాటి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 15: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు 17వ తేదీ పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో రా.. కదలిరా బహిరంగ సభ జరుగుతుందని నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ కోరారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్చూరులో టీడీపీ కదలిరా సభ నిర్వహించుకునేందుకు అన్ని శాఖల అధికారులకు అనుమతి తీసుకున్నా పోలీసులను అడ్డం పెట్టుకుని మీకు అనుమతి లేదంటూ ఆపే కుటిల రాజకీయాలన్నీ చేశారన్నారు. ఓడిపోతున్నామనే భయంతో ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరాకుండా ఉండేందుకు వైసీపీ కుటిల రాజకీయం చేస్తుందన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని అన్నారు. ఫిరంగిపురంలో జరిగే వలంటీర్ల సభకు జిల్లాల వ్యాప్తంగా ఆర్టీసీ బస్సులన్నీ తీసుకుని వలంటీర్లను తరలించటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రేపల్లె నియోజకవర్గంలో హ్యాట్రిక్ సాధించటం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో జనసమీకరణ కమిటీ కన్వీనర్లు మానుకొండ శివప్రసాద్, సుఖవాసి శ్రీనివాస్, జాగర్లమూడి శ్రీనివాస్, జీ.దయారత్నం, యల్లావుల అశోక్, రేపల్లె టీడీపీ నాయకులు రామారావు, జీవీ నాగేశ్వరరావు, పి.మల్లికార్జున్‌రావు, యలవర్తి లక్ష్మీ, వి.సుబ్రహ్మణ్యం, సాయికుమార్, శంకర్, జనసేన నాయకులు మహేష్ పాల్గొన్నారు.

పత్రికా విలేకరిపై దాడి పిరికిపంద చర్య

భట్టిప్రోలు, ఫిబ్రవరి 15 : పత్రికా విలేకర్లపై దాడి చేసిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేయాలని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం మాట్లాడుతూ అమరావతి మండలం మల్లాది గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను బయటపెట్టిన విలేకరి పరమేశ్వరరావుపై వైసీపీ నాయకులు దాడి చేశారన్నారు. ఎస్పీ రవి శంకర్‌రెడ్డి నిర్లక్ష్యంగా ఉన్నందున మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణపై, జర్నలిస్టుల మీద, జనసేన, బీజేపీ నాయకుల మీద దాడులు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం మీద జర్నలిస్టు సంఘాలు చేసే పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని శ్రీనివాసరావు హామీనిచ్చారు.

భక్తిశ్రద్ధలతో వెల్లటూరు తిరునాళ్ళ

భట్టిప్రోలు, ఫిబ్రవరి 15 : మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న సిద్ధి బుద్ధి సమేత సిద్ధిగణపతి స్వామివారి కల్యాణ ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా కల్యాణమూర్తులైన సిద్ధిగణపతిస్వామి వార్లను ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలో కొలువైన కామేశ్వరి అమ్మవారికి సామూహిక పూజలు, శేషవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. గురువారం ఉదయం షష్టి గణపతి హోమాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఉత్సవాలను దేవస్థాన ధర్మకర్తలు తాడికొండ శేషగిరిరావు, కుటుంబసభ్యులు పర్యవేక్షించారు.

పదిలో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులు కావాలి : డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో నారాయణరావు

చెరుకుపల్లి, ఫిబ్రవరి 15: పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో భయపడకుండా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ రావు అన్నారు. గురువారం మండలంలోని గుళ్ళపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులకు పది పరీక్షల్లో ఉత్తీర్ణులైై బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను క్రమం తప్పకుండా చదువుకోవాలన్నారు. నూటికి నూరుశాతం విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఎంఈవో నవీన్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 15: శ్రీగంగాపార్వతీ సమేత పృథ్వీశ్వరస్వామి ఆలయంలో గురువారం అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయంలో హోమగుండ పూజలు జరిగాయి. ధ్వజస్తంభానికి సహస్ర ప్రతిష్ఠాచార్య బ్రహ్మశ్రీ సర్వ వెంకట శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ దుంపా ప్రసాదరావు, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ, టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామి, తాతా ఏడుకొండలు, కేసన రామకృష్ణ, ఉప్పాల సాంబశివరావు, నాగుల నరేంద్ర, ఉయ్యూరు శివకృష్ణ, పూలా రాధాకృష్ణ, షేక్ రాము, వీరంకి శివ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


ఎన్ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీఎన్జీవో అసోసియేషన్ సభ్యులు

సమస్యలను పరిష్కరించాలని నిరసన

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 15: సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం ఏళ్లతరబడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీఎన్జీవో అద్దంకి తాలుకా యూనిట్ జాయింట్ యాక్షన్‌కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం అద్దంకిలోని ఎన్ఎస్పీ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అద్దంకి తాలుకా యూనిట్ జాయింట్ యక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో సభ్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పాత బకాయిలు వెంటనే చెల్లించి 12వ పీఆర్సీకి అనుగుణంగా ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ రుణాల కోసం పెట్టుకున్న వాటిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అద్దంకి తాలుకా జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు గద్దల కిరణ్‌కుమార్, కార్యదర్శి తాళ్ళూరి రమేష్‌బాబుతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘ నాయకులు, సభ్యులు నిరసన వ్యక్తం చేశారు.


పర్చూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ ప్రతినిధులు

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

● జేఏసీ తాలూకా అధ్యక్షులు సత్యన్నారాయణ

పర్చూరు, ఫిబ్రవరి 15: ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షన్‌దారుల న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ తాలూకా అధ్యక్షులు ఎం.సత్యన్నారాయణ కోరారు. ఈనెల 27న తలపెట్టిన కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న ప్రభుత్వం వాగ్దానం నెరవేర్చకపోగా సీపీఎస్‌ను తలదన్నే మరో జీపీఎస్‌ను తీసుకురావటం విచారకరం అన్నారు. పీఆర్సీని అములు చేయటంతోపాటు, ఐఆర్‌ను కూడా ప్రకటించాలన్నారు. ఉద్యోగులపై పనివత్తిడి తగ్గించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణను వెంటనే పూర్తిచేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించకపోవటం ప్రభుత్వ మొండివైఖరికి నిదర్శనం అన్నారు. కొవిడ్- 19 కారణంగా మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు కారుణ్యా నియామకాల గురించి పట్టించుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఉద్యోగుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యు.సుబ్బారావు, ప్రకాష్, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా ఇంకొల్లులో 'రా కదిలిరా'

అధినేత చంద్రబాబు సభకు భారీ ఏర్పాట్లు

సభా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి

ఎన్ని కుట్రలు చేసినా సభ నిర్వహించి తీరుతాం

టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఫిబ్రవరి 15: అధికార వైసీపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు తలపెట్టిన రా కదలిరా సభను నిర్వహించి తీరుతామని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి ధీమా వ్యక్తం చేశారు. పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో ఈనెల 17న నిర్వహించనున్న రా కదిలిరా సభ చరిత్రలో నిలిచేలా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే ఏలూరి సభా ప్రాంగణాన్ని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవితోపాటు పార్టీ శ్రేణులతో కలసి ఏలూరి పరిశీలించారు. వైసీపీ సర్కార్ అవినీతి, దౌర్జన్యాలపై తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఇంకొల్లులోని తారక రామా విజయభేరీ ప్రాంగణ వేదికగా శంఖారావం పూరించనున్నారు. తెలుగుదేశం మేనిఫేస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించనున్నారు. 2024లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఈవేదిక ద్వారా శంఖం పూరిస్తారన్నారు. బాపట్ల పార్లమెంట్ చరిత్రలో నిలిచిపోయేలా కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. 20 ఎకరాల్లో బహిరంగ సభను తీర్చిదిద్దుతున్నారు. ఈసభకు దాదాపు లక్షమందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని నాయకులు భావిస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఆరుగురు ఇన్‌చార్జిలను కూడా నియమించారు.


సభ ఏర్పాట్లను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్‌తో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

సభ నిర్వహించి తీరుతాం..

ఎమ్మెల్యే ఏలూరి

ఈనెల 17న ఇంకొల్లులో తలపెట్టిన రా కదిలిరా సభను నిర్వహించి తీరుతామని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. కావాలని రాజకీయంగా సభను అడ్డుకునే ప్రయత్నం చేయటం సరికాదన్నారు. సభను అడ్డుకోవాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అన్నీ అనుమతులతో దరఖాస్తు చేసినా అధినేత చంద్రబాబు పర్యటనను ప్రభుత్వం అడ్డుకోవాలని ప్రయత్నిస్తుందన్నారు. గతంలో నారా లోకేష్ యువగళం పాదయాత్రను కూడా అడ్డుకున్నారని గుర్తుచేశారు. చట్ట ప్రకారం ప్రతిపక్ష నేత సభకు అనుమతి ఇవ్వాల్సిన ప్రభుత్వం అడ్డంకులు సృష్టించటంపై ఆయన విస్మయం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్షం లేకుండా చేయాలని చూస్తుందని, దీన్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

కుట్రపూరితంగా సభను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారు

● విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, ఫిబ్రవరి 15: ఇంకొల్లులో ఈ నెల 17 న రా కదలిరా చంద్రబాబు సభను కుట్రపూరితంగా అడ్డుకోవాలని సైకో ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నదని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆరోపించారు. ఇంకొల్లులో చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభా ప్రాంగణంలో పార్టీ కార్యకర్తలు చేస్తున్న సభా పనులను బుధవారం రాత్రి పోలీసులు అడ్డగించారు. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంకొల్లులో వెంకట నారాయణ అనే రైతు కౌలుకు తీసుకున్న దేవాలయ భూమి 376-1 సర్వేనంబరు లోని 18 ఎకరాలలో చంద్రబాబు సభను నిర్వహించడానికి ఆయన దగ్గర అనుమతి తీసుకున్నామన్నారు. ఈ విషయమై ఈ నెల 13 వతేదీన కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలకు అనుమతి కోసం దరఖాస్తు చేశామన్నారు. శాంతి యుతంగా సభను నిర్వహించడానికి వారి అనుమతి కోరామన్నారు. కాని వారు ఈ విషయాన్ని తేల్చక పోగా, సభా ప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను పోలీసులు అడ్డ గించడానికి ప్రయత్నించడం దారుణ మన్నారు. దేవదాయ శాఖకు చెందిన అధికారితో బుధవారం ఇంకొల్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి, ఈ నెపంతో సభను నిర్వహించకుండా పోలీసులు ఆపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసులను, వ్యవస్థలను నీరుగారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసే రాజకీయ క్రీడలో పోలీసులు పావులుగా మారవద్దన్నారు. చంద్ర బాబు సభ ముగిసిన తర్వాత యథావిధిగా పొలాన్ని బాగు చేసి ఇస్తామని రైతు అనుమతితో ఈ స్థలంలో సభ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చట్టాన్ని ఉల్లంఘించకుండా, ప్రజాస్వామ్య పద్ధతులతో పార్లమెంట్ పరిధిలోని ప్రజానీకం, పార్టీ కార్యకర్తలు, నాయకులతో 17 వతేదీన చంద్రబాబు సభను నిర్వహిస్తామని ఏలూరి స్పష్టం చేశారు.


టీడీపీలో చేరిన పంగులూరు వైసీపీ నేతలతో మండల నాయకులు

రా కదలి రా సభను విజయవంతం చేయాలి

చినగంజాం, ఫిబ్రవరి 15 : ఇంకొల్లులో శనివారం జరిగే రా కదలి రా సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల పరిశీలకులు టి.జయప్రకాశ్‌నారాయణ, మండల అధ్యక్షులు పొద వీరయ్యలు పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ ప్రధానకార్యదర్శి అబ్దుల్‌కలాంఅజాద్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. ఇంకొల్లులోని తారకరామా విజయభేరి ప్రాంగణంలో జరిగే రా కదలి రా సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారని, జనసేన నాయకుల సమన్వయంతో ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకులు జయప్రకాశ్‌నారాయణ

సభకు వైసీపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా శనివారం జరిగే సభలో చంద్రబాబు పాల్గొంటారని అన్నారు. రెండు నెలలు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కష్టపడితే జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపిస్తామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆసోది సుబ్బారెడ్డి, యార్లగడ్డ లక్ష్మి, టీ.జయరావు, బత్తుల శ్రీనివాసరావు, రాయని ఆత్మారావు, నరహరి శ్రీనివాసరావు, నక్కల వీరరాఘవులు, మోటుమర్రి రామసుబ్బారావు, తాటి రాజశేఖర్, పీ. పార్థసారిథి, టి.చిన్నా, షేక్.జిలాని, బి. రమేష్‌బాబు, కోకి భాస్కర రెడ్డి, రాజు వెంకటేశ్వరరెడ్డి, బడుగు సామేలు, ఎం.లక్ష్మయ్య సలాం తదితరులు పాల్గొన్నారు.

రా కదలి రా సభకు భారీగా తరలి రావాలి

పంగులూరు, ఫిబ్రవరి 15 : ఇంకొల్లు కేంద్రంగా ఈ నెల 17న జరిగే రా కదలి రా మహాసభకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్ కోరారు. పంగులూరు మండలానికి అతి చేరువలో జరుగుతున్న మహాసభలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ మహాసభకు అన్ని గ్రామాల నుంచి వందల సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, వరపర్ల సుబ్బారావు, తాటి సుబ్బారావు, గరిమిడి జగన్, అల్లంనేని స్వామి, కోమటి ప్రసాద్, శివరాజు, గొట్టిపాటి కాజా, బోరెడ్డి ఓబుల్‌రెడ్డి, చిలుకూరి వెంకటేశ్వర్లు, జాగర్లమూడి పూర్ణ పలువురు స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేతలు

మండల కేంద్రమైన పంగులూరుకు చెందిన వైసీపీ నేతలు ముప్పవరం పార్టీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ మండలాధ్యక్షులుగా పనిచేసి వైసీపీలో కొనసాగుతున్న చిలుకూరి వీరరాఘవయ్య, బీసీ నాయకులు అద్దంకి ఉమ్మయ్యలు గురువారం టీడీపీలో చేరారు. మండల అధ్యక్షులు రావూరి రమేష్ వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

రక్తనాళ సంబంధిత వ్యాధుల నిపుణులు ఒంగోలు రాక
12 సంవత్సరాల అపార అనుభవము కలిగిన బృందం నుండి
డా. నరేంద్రనాద్ మేడా వారి వైద్య బృందం నుండి
డా॥ అజయ్. బి. మోసూర్
M.S General Surgery, DNB Vascular Surgery
Consultant Vascular & Endovascular Surgeon
KIMS Hospitals, Secunderabad
ఈ నెల తేది. 18-02-2024, ఆదివారం
ఉ॥ 10గం॥ నుండి సా॥ 4గం॥ వరకు అందుబాటులో ఉంటారు
KIMS HOSPITALS
కిమ్స్ హాస్పిటల్
NH-5, నార్త్ బైపాస్ రోడ్డు, ఒంగోలు.
అపాయింట్‌మెంట్ కొరకు
08592 - 667788, 70958 78686, 77999 80904

SHRIRAM Finance
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.
గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు
ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.
వేలం వేయు తేది: 26.02.2024 వేలం వేయు చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇం.నం.27-2-7, జి.ఎన్.టి రోడ్, పద్మావతి ప్లాజా, 3వ అంతస్తు, ఎ కె నగర్ నెల్లూరు-524004

లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు	లోన్ ఎకౌంట్ నం	ఖాతాదారు పేరు
ADDAKPJ2308010001	TAMMISETTI RAVI	CHIRLPJ2308180001	DEGA KALPANA
CHIRLPJ2308080003	PALEKARI JALLENDRA RAO	CHIRLPJ2308300002	SHAIK KARISHMA
CHIRLPJ2308110002	VARI RUKMINI		

పైన ఉదహరించిన చిరునామాల వద్ద వేలం వేయడం జరుగుతుంది. వేలం సమయం:11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ పి.బాబును సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.
తేది: 14.02.2024
స్థలం : నెల్లూరు
సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రెండు మాత్రలతో సరిపెట్టారు - వైద్యం కూడా చేయలేదు

ఆసుపత్రిలో ఎమ్మెల్యే రవికుమార్ ఎదుట క్షతగాత్రుల గగ్గోలు

అద్దంకి, ఫిబ్రవరి 15 : వైసీపీ పాలనలో వైద్యం పేదల ప్రాణాలకు సంకటంగా మారిందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే రవికుమార్ గురువారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. బుధవారం సాయంత్రం ప్రభుత్వ వైద్యశాలకు వస్తే 12 గంటల సమయం గడిచినా నొప్పులకు రెండు మాత్రలు మా త్రమే ఇచ్చి సరిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రవికుమార్ వెంటనే వైద్యులను పిలిపించి మాట్లాడారు. వైద్యశాలలో చేరి 12 గంటలు గడిచినా కనీసం వైద్యులు రాకపోవటం, కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా చిన్న గాయాలు కూడా అదే విధంగా ఉండటం ఏమిటని ప్రశ్నించారు. రెండు బిళ్లలు ఇచ్చి సరిపెడతారా అని ప్రశ్నించారు. క్షత గాత్రులకు వెంటనే వైద్యం అందించాలని, అవసరమైతే ప్రయివేట్ వైద్యశాలకు పంపి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మార్చురీ వద్ద ఉన్న మృతదేహాల వద్ద నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

సంతమాగులూరు : మండలంలోని ఏల్చూరు గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా గురువారం మరొకరు మృతి చెందారు. నరసరావుపేట ప్రయివేటు, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. ఆయా వైద్యశాలల వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులను మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మృతదేహాలను పరిశీలించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 50 వేలు, క్షతగాత్రులకు రూ. 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అట్లా చినవెంకటరెడ్డి, తేల ప్రోలు రమేష్, దుద్దేల గాలియ్య, గొట్టిపాటి చౌదరిబాబు, తాత్కాలికం దేశింగరాజు తదితరులు పాల్గొన్నారు.


నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో క్షతగాత్రులను పరామర్శించి అనంతరం వైద్యులతో మాట్లాడుతున్న అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్




నామ్ రోడ్డులో ఉదయం 9 గంటల సమయంలో దట్టంగా ఉన్న పొగమంచు


పొగమంచుతో లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, ఆటోలు

ఒక వైపు పెరిగిన ఎండలు... మరో వైపు దట్టమైన పొగమంచు

అద్దంకి, ఫిబ్రవరి 15 : ఒక వైపు పెరిగిన ఎండలు... మరో వైపు దట్టమైన పొగమంచుతో అద్దంకి ప్రాంతంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఎండల తీవ్రత ఈనెల మధ్య నుంచే ప్రారంభమయ్యాయి. అదే సమయంలో సంక్రాంతి నెలలో ఉండే పొగమంచు ఫిబ్రవరి నెల మధ్య లో కూడా ఉంది. దీంతో రా త్రి సమయంలో చలిగాలులు, ఉదయం సమయంలో దట్టమైన పొగమంచు, పగటి సమయంలో ఎండ వేడిమి ఎక్కువగా ఉంటోంది. గురువారం ఉదయం పొగమంచు మరింత దట్టంగా ఏర్పడింది. దీంతో ఉదయం 9 గంటల సమయం వరకు కూడా వాహనచోదకులు లైట్లు వేసుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రెండు రకాల వాతావరణ పరిస్థితులు ఆరోగ్య సమస్యలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి

- డీఎస్పీ ప్రసాదరావు

చీరాల,ఫిబ్రవరి 15 : నిర్దిష్ట వ్యక్తులు లేదా వ్యవస్థలకు సంబంధించిన బాధ్యులు ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలని డీఎస్పీ ప్రసాదరావు అన్నారు. ఆర్టీఐ రక్షణ్ చీరాల నియోజకవర్గ అధ్యక్షురాలిగా నియమితులైన కారంపూడి పద్మినికి గురువారం డీఎస్పీ ప్రసాదరావు గుర్తింపు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేవిధంగా బాధ్యులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


గుర్తింపు కార్డును అందజేస్తున్న డీఎస్పీ ప్రసాదరావు

పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లు పరిశీలన


విప్పర్లవారిపాలెంలో పోలింగ్ బూత్‌వద్ద వసతులను పరిశీలిస్తున్న సునిల్‌కుమార్

అద్దంకి, ఫిబ్రవరి 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌లను, వసతులను నియోజకవర్గ ప్రత్యేకాధికారి, గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీల్‌కుమార్ గురువారం పరిశీలించారు. అద్దంకి పట్టణం, మండల పరిధిలో మొత్తం 56 పోలింగ్ కేంద్రాలు ఉండగా వెంపరాల, ఉప్పలపాడు, మైలవరం మినహా మిగిలిన అన్ని గ్రామాలలో 50 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదనంగా ఏర్పాటు చేయాల్సిన వసతులను కూడా అడిగి తెలుసుకున్నారు. ఎంఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మి, వీఆర్‌వోలు ఉన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 15: మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి పుస్తకాలను దాతలు అందజేశారు. గుండ్లకమ్మ రాజకీయ మాసపత్రిక ఆధ్వర్యంలో ఎడిటర్ సందిరెడ్డి కొండలరావు పాఠశాల గ్రంథాలయానికి వివిధ రకాల పుస్తకాలను ఇన్‌చార్జి హెచ్‌ఎం కోవి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ పుస్తకాల ద్వారా ప్రముఖుల జీవిత విశేషాలను తెలుసుకుని వారి ఆశయాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, శంకరరావు, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న దాతలు

అధికారుల తీరు గర్హనీయం


సమావేశంలో మాట్లాడుతున్న సాధనసమితి కార్యకర్తలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 15 : చీరాల పరిధిలోని అధికారులు తీరు గర్హణీయమని చీరాల సాధనసమితి సామాజిక కార్యకర్తలు అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చీరాల నియోజకవర్గ పరిధిలో పలుచోట్ల ఆక్రమణలు జరిగినట్లు తెలిపారు. అలాగే దళితవాడల్లో అభివృద్ధి శూన్యమని చెప్పారు. అంతేకాకుండా ప్రజా సమస్యలు పరిష్కారానికి భిన్నంగా నెలకొన్న కార్యక్రమాలకు మాత్రమే ప్రాధాన్యత కల్పించేందుకు అధికారులు పోటీపడుతున్నారని ఆరోపించారు. పారదర్శకంగా పనిచేయకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి ఏసురత్నం, శీలం రవికుమార్, బత్తుల శామ్యేల్, అచ్యుతుని బాబూరావు, గూడూరి శివరామకృష్ణ, పాలవలస శ్రీను, పుష్పరాజు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించండి

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 15 : రోగులకు మెరుగైన సేవలు అందించాలని పలువురు పేర్కొన్నారు. మండల పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌ను గురువారం ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. భవిష్యత్ అవసరాలపై చర్చించారు. వారికి అవసరమైన సేవలు అందించాలని సూచించారు కార్యక్రమంలో పీఆర్ డీఈ శేషయ్య, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

ఓటు విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 15: అర్హులైన విద్యార్థులందరూ తమ ఓటు విలువను తెలుసుని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని ఈఆర్‌వో పీఈ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు నమోదు అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. అర్హత ఉన్నవారిని ఓటు నమోదు చేయించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎస్‌వీఈఈపీ సమన్వయకర్త డి. గంగయ్య, డాక్టర్ ఎస్. దాసు, జి. శి వకోటి, కె. వేణుబాబు, సిబ్బంది పాల్గొన్నారు

కో ఆప్షన్ మాజీ సభ్యుడు బుడేకు ఘన నివాళులు

మార్టూరు, ఫిబ్రవరి 15: ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన కో ఆప్షన్ మాజీ సభ్యులు, శ్రీ విఘ్నేశ్వర కూరగాయల వర్తక సంఘం మాజీ అధ్యక్షులు షేక్ మహమ్మద్ బుడేకు కూరగాయల మార్కెట్‌లో కమిటీ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ అభివృద్ధికి బుడే చేసిన కృషిని పలువురు వివరించారు. అనంతరం బుడే కుమారుడు రషీద్‌మార్కెట్ లోని ముఠా కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షులు కన్నె గంటి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ జాష్టి వెంకట నారాయణ, కాకోలు రామారావు, పఠాన్ కాలేషావలి, కారసాల సులేమాన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి భారత్ బంద్‌కు సహకరించండి

మార్టూరు, ఫిబ్రవరి 15 : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ బంద్‌కు అందరూ సహకరించాలని మార్టూరులో కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంద్ నిర్వహిస్తారని మార్టూరు పట్టణంలోని వ్యాపారులు అందరూ తమ దుకాణాలను మూసివేసి సహకరించాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

సమ్మెకు అందరూ సహకరించాలి

ఇంకొల్లు : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం చేయనున్న సమ్మెను ఇంకొల్లు మండల వ్యాపారులు సహకరించాలని బాపట్ల జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షులు కందిమళ్ళ రామకోటేశ్వరరావు కోరారు. మధ్యాహ్నం 12 గంటల వరకు స్వచ్ఛందంగా దుకాణాలు మూసి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

పేకాట శిబిరంపై దాడులు - ఏడుగురు అరెస్టు

పర్చూరు, ఫిబ్రవరి 15: పేకాట శిబిరంపై పర్చూరు పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పర్చూరు - దేవరపల్లి శివారు ప్రాంతంలో పేకాడుతున్న ఏడుగురును అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.10,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చనున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఈదాడుల్లో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.